

ఎన్నికల చుట్టాలొస్తున్నారు!





ఊళ్లకు ఓట్ల పండుగ కళ

ఎన్నికల సమరాంగణంలో కూటమి సైన్యం కదిలింది. పోలింగ్ దగ్గర పడుతున్న వేళ మండలాల వారీగా ప్రత్యర్థి పార్టీలపై పైచేయి సాధించేందుకు ప్రచారంతో పాటు సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న సంఘాలు, మహిళా సంఘాలు చుట్టంచూపు పేరిట గడపగడపకు వెళుతున్నాయి. ఫలానా అభ్యర్థిని గెలిపించండి.. అంటూ ఎన్నికల పండుగ వేళ పిలుపు ఇస్తున్నారు. ఆ మేరకు వీరంతా ఎన్నికల చుట్టాల్లా వ్యవహరిస్తున్నారు.

- ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి

» దూరప్రాంత ఓటర్లకు ఉచిత ట్రాన్స్‌పోర్టు
» కొందరికేమో ఖర్చులకు ఫోన్‌పేలు
» చుట్టపు చూపు పేరిట ఓట్ల అభ్యర్థన
» సామాజిక వర్గాల వారీగా గడపగడపకు..

రండి... కలిసుందాం

వివిధ రాజకీయ పార్టీల్లో కీలకంగా కొన్ని కుటుంబాలు ఫలితాలను శాసిస్తాయి. కాని మారుతున్న రాజకీయ పరిణామాల క్రమంలో పార్టీల శతృత్వమే ఎక్కువగా ప్రభావితం చేస్తోంది. పోలింగ్ జరిగేందుకు ఇంకా కొద్దిరోజులే మిగిలి ఉండగా, ఎక్కడికక్కడ మద్దతు కూడకట్టుకునేందుకు వివిధ రాజకీయ పక్షాలు, అభ్యర్థులు ఎత్తుకు పై ఎత్తు వేస్తున్నారు. ప్రత్యక్షంగా తాము ఇప్పటికే ప్రచారంలో ఊరువాడా తిరిగినప్పటికి ఇప్పుడు తమ అంతరంగీకులను ప్రత్యేకించి కొన్ని కుటుంబాల వద్దకు ఎన్నికల పిలుపు కోసమే పంపుతు న్నారు. పనిలో పనిగా దూరప్రాంతాల్లో ఉన్న ఓటర్లను ఆదివారం నాటికే ఆయా స్వగ్రామాలకు చేరుకునేలా జాగ్రత్తలు పడుతున్నారు. ఏలూరు, దెందులూరు, నూజివీడు, కైకలూరు వంటి నియోజక వర్గాలకు చెందిన అనేక కుటుంబాలు వృత్తి, వ్యాపారరీత్యా గుంటూరు, హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు వంటి నగరాల్లో నివాసం ఉంటున్నారు. వీరందరిని ఇప్పటికే ఎవరెవరు ఎక్కడుంది? ఎవరి ఇంట్లో ఎన్ని ఓట్లు బయట ఉంది? క్షుణంగా లెక్కలు తీశారు. ఓటర్ స్లిప్ అందించే క్రమంలోనే వార్డు స్థాయిలో ఉన్న నేతలు ఈ అన్వేషణ పూర్తి చేశారు. ఏలూరుకు చెందిన కొన్ని కుటుంబాలను హైదరాబాద్ నుంచి రప్పించేందుకు వీలుగా ఇప్పటికే వైసీపీలో కొందరు ప్రయత్నాలు ఆరంభించారు. ఎలాగో శని, ఆదివారాలు సెలవు కాబట్టి సోమవారం జరిగే ఓట్ల పండగకు రండి అంటూ పిలుపులు పంపారు. ఇంకేముంది పోలింగ్‌కు ఒకరోజు ముందే ఆదివారం ఒక్క ఏలూరు నగరానికి వచ్చే వారి సంఖ్యే దాదాపు 3వేలకు పైబడి ఉన్నట్టు సమాచారం. ఉంగుటూరు ప్రాంతానికి చెందిన అనేకమంది బయట ప్రాంతాల్లో ఉండడంతో వారికి ఫ్రీ ట్రాన్స్‌పోర్టు ఏర్పాటు చేసి మరీ సొంత గ్రామాలకు రప్పిస్తున్నారు. వాస్తవానికి సంక్రాంతి పండుగ రోజుల్లో కోడిపందేలకు హైదరాబాద్ సగం నగరం ఖాళీచేసి జనం ఇక్కడికి రావడం రివాజు. కాని ఈసారి ఎన్నికల పండుగకు ఎంతమంది వస్తే అంతమందిని రప్పించడానికే అన్నిపక్షాలు ప్రయత్నిస్తున్నాయి. ఎందుకంటే ఈసారి జరిగే ప్రతిష్ఠాకర పోటీలో ప్రతి ఓటు విలువైనదే కాబట్టి ఎక్కడా వెనక్కి తగ్గకుండా వారందరిని రప్పించే ప్రయత్నాలు సాగుతున్నాయి. కొందరికి రవాణా ఖర్చుల నిమిత్తం ఫోన్ పే చేస్తున్నట్టు సమాచారం. వచ్చి వెళ్లడానికి అయ్యే ఖర్చుతో పాటు ఓటు ఖర్చును చెల్లిస్తున్నట్టు ప్రచారం సాగుతోంది.

■ **ఎన్ఆర్ఐల్లో ఆరాటం**

ప్రవాసాంధ్రులు అనేకమంది ఇప్పటికే ఏపీకి ప్రత్యేకించి గోదావరి జిల్లాలకు చేరుకున్నారు. గడిచిన నెలరోజులుగా వీరిలో అనేకమంది కూటమి పక్షాన ప్రచార బాధ్యతలను భుజానకు ఎత్తుకున్నారు. క్షేత్రస్థాయి ప్రచారం చేస్తూ గతంలో ఏ పార్టీకి ఓటు వేసింది ఇప్పుడు ఏ పార్టీకి ఓటు వేయాలో ఓటర్లకు నిర్దేశం చేస్తున్నారు. వీలైతే పెద్దఎత్తున సహాయం చేసేందుకు వ్యక్తిగతంగా కాకుండా ఊరిపక్షానే అనే సంకేతాలు ఇస్తున్నారు. చింతలపూడి, దెందులూరు, ఏలూరు వంటి ప్రాంతాల్లో వీరంతా అంతర్భాగమై పనిచేస్తు న్నారు. తమకు సానిహిత్యంగా ఉన్న నేతలకు ఎక్కడెక్కడ మైనస్ ఉంది, మరెక్కడ ప్లస్ ఉంది చేరవేయడంలో 24 గంటలు కష్టపడుతున్నారు. మేమంతా కుటుంబాన్ని విదేశాల్లో వదులుకుని ఇక్కడి ప్రచారానికి వచ్చామంటే ఎందుకు వచ్చామో మీరే ఆలోచించుకోండి. రాష్ట్రం బాగుపడాలన్నదే మా కోరిక అంటూ వ్యక్తిగత ప్రచారానికి దిగుతున్నారు.

చుట్టాలను వదలడం లేదు..

రాజకీయాల్లో అప్పుడప్పుడు అందరికీ వరుసలు గుర్తుకు వస్తాయి. పోటీ అంతా నువ్వానేనా అనే విధంగా ఉండడంతో ఏలూరు పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లోనూ బుధవారం నుంచే చుట్టపుచూపు పేరిట కొందరు సరికొత్త ప్రచారానికి దిగారు. పార్టీ అభ్యర్థులుగా ఉన్నవారి సన్నిహితులు, బంధువులు, స్నేహితులు ఎక్కడికక్కడ తమకు తెలిసిన వారి ఇళ్లకు వెళ్లి ఫలానా పార్టీ అభ్యర్థికే ఈసారి మద్దతు ఇవ్వండి అంటూ అభ్యర్థించడం ప్రారంభించారు. ఈసారి ఎన్నికల్లో ఇదే హైలెట్‌గా భావిస్తున్నారు. బీసీ, దళిత కొన్ని అగ్రవర్ణాల్లో పనికట్టుకుని మరీ తమకు తెలిసిన వారి, అయిన వారి ఇళ్లకు వెళ్లి మరీ ఈ తరహా అభ్యర్థనలు చేస్తు న్నారు. ఇంకొందరైతే మీకైతే ఓటు ఉందా? లేదా? అంటూ ఆరా తీయడం, ఖచ్చితంగా ఓటు వేయండి, ఫలానా పార్టీకి మాత్రమేనంటూ వాట్సప్ సందేశాలు ఇస్తున్నారు. ఈసారి మార్పు రావాలి, అనే నినాదంతో ఎక్కువమంది తమకు తెలిసిన వారందరికి ఈ సందేశాలు పంపడంలో ముందు వరుసలో ఉన్నారు.

ఇప్పటికే నగదు మాయం

ఎన్నికల వేళ జిల్లాలో చాలాచోట్ల ఏటీఎంలు వట్టిపోయి కనిపిస్తున్నాయి. డబ్బు వినియోగం ఈ మూడురోజులు అత్యధికంగా ఉండబోతోంది కాబట్టి దీనికి తగ్గట్టుగానే ఇప్పటికే ఏటీఎంలు పనిచేయకుండా పోయాయి. అలాగే 500 నోట్లకు మార్కెట్లో కాళ్ళు వచ్చాయి. కేవలం 20,50 నోట్లు మాత్రమే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఎమ్మెల్యే అభ్యర్థులు అయితే ఇప్పటికే నిబంధనలు పక్కనపెట్టి 10 నుంచి 15 కోట్లు ఖర్చు పెట్టుతున్నారు. ఇప్పటికే డ్వాక్రా సభ్యులకు తలోక వెయ్యి చొప్పున ప్రధాన పక్షాలు అన్ని అందించాయి.

ఎన్నికల కళ వచ్చేసింది..

నోటిఫికేషన్ విడుదలై దాదాపు 48 రోజులు పూర్తయింది. మరో నాలుగు రోజుల్లో పోలింగ్ జరగబోతోంది. ఇప్పుడు అంతా ఎక్కడ చూసినా ఎన్నికల కళే కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. రాత్రివేళ నేతలు కదలికలు పెరిగాయి. మహిళా గ్రూప్‌లీడర్లు, కులసంఘాల లీడర్లు, ప్రధాన పార్టీల అభ్యర్థుల నివాస గృహాల్లోనూ పగలు, రాత్రి తేడా లేకుండా జోరుగా పంపకాల మంత్రాంగాలు సాగుతున్నాయి. మీటింగ్ ఉంది రండి అంటూ ఆయా గ్రూపులీడర్లకు వర్తమానాలు పంపించి, నగదు వారి చేతికి ఇచ్చి పంపిస్తున్నారు.

■ **ఓటుకు రేటు ఎంతంటూ ఆరా**



ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో రకంగా ఇప్పటికే ఓటుకు రేటు నిర్ణయించి, పంపకాలకు సిద్ధమవుతు న్నారు. దెందులూరు, ఏలూరు, కైకలూరు, నూజివీడు, ఉంగుటూరు వంటి నియోజకవర్గాల్లో అధికార వైసీపీ అభ్యర్థులు వారి అనుచరులు పెద్దఎత్తున ఓటుకు నోటు ఆఫర్ చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే ఒక్కో ఓటుకు వెయ్యి నుంచి 1500 ఇస్తున్నారని ప్రచారం సాగింది. ఇంకోవైపు కూటమి పక్షాన ఎంత ఇస్తున్నారనే ఆరానే విస్తృతంగా వినిపిస్తోంది. గ్రామస్థాయిలో ఓటున్న అందరికి కాకుండా కొందరిని మాత్రమే గుర్తించిమరీ జాబితా సిద్ధం చేశారు. వీరందరికి శని, ఆదివారాల్లోపే గిఫ్ట్ ఇవ్వడానికి రంగం సిద్ధమైంది. మద్యం బాబులను ఆకర్షించేందుకు కొందరు టోకెన్ పద్ధతి అనుసరి స్తున్నట్టు చెబుతున్నారు. ఇది కూడా అభ్యర్థికి అత్యంత అనుకూలురు చేసే పనిగానే వినిపిస్తోంది.

నాల్గవ రోజు ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ పోలింగ్


పోస్టల్ బ్యాలెట్ వేస్తున్న ఏఎస్పీ స్వరూపరాణి

ఏలూరు సిటీ/ ఉంగుటూరు/ఏలూరు క్రైం, మే 8 : జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ ఆదేశాల మేరకు జిల్లాలో 4వ రోజు బుధవారం పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగిందని జిల్లా మీడియా సమన్వయ కర్త, డీపీవో తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. ఆర్వోలు ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాల వద్ద ఉద్యోగులు తమ ఓటు హక్కు సజావుగా వినియోగించుకోవడానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. అత్యవసర సర్వీసులు, ఆర్టీసీ ఉద్యోగులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారన్నారు. పోలింగ్ సజావుగా జరగడానికి టోకెన్ విధానం అమలు చేశారమన్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకోవడానికి వస్తున్న ఉద్యోగులకు సమాచారం అందించడానికి , సహకరించడానికి పోలింగ్ కేంద్రాల వద్ద లైజన్ అధికారులను ఏర్పాటు చేశామన్నారు. ఏదైనా తక్షణ సమాచారం కోసం తనను 98499 03321 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు. ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో బుధవారం 91 పోస్టల్ బ్యాలెట్ ఓట్లను వినియోగించుకున్నారని ఆర్వో ఖాజావలి తెలిపారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో ఇప్పటి వరకు 1,553 ఓట్లను వినియోగించుకున్నారన్నారు. ఏలూరులో జిల్లా అదనపు ఎస్పీ స్వరూపరాణి తన ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరు ఓటును వినియోగించుకోవాలన్నారు.




ట్రైనీ ఐపీఎస్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

ట్రైనీ ఐపీఎస్ అధికారులకు ఎన్నికలపై అవగాహన

ఏలూరు క్రైం, మే 8 : ఇండియన్ పోలీస్ సర్వీస్ శిక్షణ పొందుతున్న 9 మంది అధికారులు జిల్లాకు ఎన్నికల ప్రక్రియ తెలుసుకోవడానికి బుధవారం వచ్చారు. వీరికి జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లు, సమీకరణ, బలగాల మోహరింపు, ఎన్నికల ప్రలోబాలకు గురిచేసే ప్రోపర్టీలను స్వాధీనం చేసుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఎన్నికల ఆటాచ్‌మెంట్ సమయంలో అధికారులకు శిక్షణ, ఎన్నికల బందోబస్తు పథకం, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్‌ల పనితీరు, ఫ్లైయింగ్ స్క్వాడ్‌ల తనిఖీలు, స్వాధీనాలు, ఎన్నికల ప్రచారానికి అనుమతులు మంజూరు చేయడం, ఎన్నికల వ్యయాన్ని పర్యవేక్షించడం వంటి అంశాలు ఏ విధంగా చేయాలో వివరించారు. నాన్‌బెయిలబుల్ వారెంట్లు అమలు చేయడం, ఆయుధాల డిపాజిట్, రిటర్నింగ్ అధికారులతో సమన్వయం, మస్టరింగ్, డీ మస్టరింగ్, ఎన్నికలకు సంబంధించి కాలానుగుణ నివేదికలను పంపడం, సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ మొదలైన బలగాలను ఎన్నికల్లో ఏ విధంగా వినియోగించాలో తెలిపారు.

శ్రీను మామను గెలిపించేందుకు
వెంకీమామ వచ్చాడు..

» కామినేనికి మద్దతుగా
సినీ హీరో వెంకటేశ్ ఎన్నికల ప్రచారం

కైకలూరు/కలిదిండి, మే 8: కైకలూరులో శ్రీనుమామను గెలిపించేందుకు వెంకీ మామ వచ్చాడు. కమలానికి ఓటు వేసి కామినేనిని గెలిపించండి'.. అంటూ సినీహీరో వెంకటేశ్ తన ప్రసంగంతో ఓటర్లను ఆకట్టుకున్నారు. కైకలూరు అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌కు మద్దతు తెలుపుతూ కలిదిండి మండలం కలిదిండి, ఎస్.ఆర్పీ అగ్రహారం, సానారుద్రవరం, కోరుకొల్లు, కైకలూరు మండలం వేమవరప్పాడు, తామరకొల్లు, వింజరం, ఆచవరం మీదుగా కైకలూరులో బుధవారం వెంకటేశ్ రోడ్‌షో నిర్వహించారు. అభిమానులు పెద్దఎత్తున బైక్ ర్యాలీ చేపట్టారు. దారి పొడవునా మహిళలు హారతులు పట్టారు. వెంకటేశ్ తనదైన శైలిలో అభిమానులకు అభివాదం చేస్తూ యువతను ఉత్సాహ పరుస్తూ ముందుకు సాగారు. కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌కు కమలం గుర్తుపై, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్‌కు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కైకలూరు బైపాస్ రోడ్డులో గంగానమ్మ గుడి వద్ద చిన్నపిల్లవాడిని ఎత్తుకుని ముద్దాడారు. మార్కెట్ సెంటర్లో పోలీసులను చూస్తూ 'నమస్తే పోలీస్ ఇంకా ఉన్నతంగా బతకాలి.. రానున్న రోజుల్లో మంచి రోజులు వస్తాయి' అంటూ వారిని ఉత్సాహపరిచారు. కైకలూరు శ్రీశ్యామలాంబ ఆలయం వద్ద అక్కాచెల్లెల్లు, బాబు, అన్నా.. అంటూ అందరిని సంబోధిస్తూ ఆయన ప్రసంగించారు. ఆయన ఏమన్నారంటే.. కైకలూరుకు వెంకీమామ, పెళ్లికాని ప్రసాదు, తులసి, చంటి వచ్చాడు. సినిమాలే కాదు సమాజం కూడా కావాలి. శ్రీను మామ అంటే నాకు ఎంతో ఇష్టం. ఒక్కసారి పిలిస్తే పలికే మనిషి. ఏ సమస్యనైనా పరిష్కరించగలిగన వ్యక్తి. ఎవరితో వివాదాలు పెట్టుకోవడం నేను చూడలేదు. కామినేనికి ఓట్లు వేస్తే కైకలూరు అభివృద్ధి పథంలో దూసుకు పోతుంది. ప్రజలందరూ మంచి వ్యక్తులను ఎన్నుకోవాలి. ఈ నెల 13వ తేదీన పోలింగ్‌బూత్‌కు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవాలి'.. అంటూ కోరారు. ఈ సందర్భంగా అభిమానులను ఉత్తేజపరుస్తూ సినిమా డైలాగులు చెప్పారు. కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ.. 'ఓట్లు అడిగేందుకు ఇంటికి వస్తున్న వైసీపీ నాయకులను ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై నిలదీయాలి. ప్రజా ఆస్తులను జగన్ దోచుకోవాలని చూస్తున్నారని స్థానికంగా వచ్చే వైసీపీ నాయకులను గట్టిగా ప్రశ్నించండి. కైకలూరులో వైసీపీ పాలనలో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అతని కుమారులు అడ్డు అదుపు లేకుండా అక్రమాలు, భూదందాలు చేశారు. పుట్లచెరువు గ్రామంలో 450 ఎకరాల మధ్యలో అక్కడక్కడ భూములు కొనుగోలు చేసి మార్కెట్ కంటే తక్కువ ధరలకు రైతులను బెదిరించి లీజులకు తీసుకున్నారు. కైకలూరులో రౌడీలను ప్రోత్సహించి దాడులకు తెగబడ్డారు. కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపిస్తే రౌడీ అనేవాడిని లేకుండా కైకలూరు ప్రజలు ప్రశాంతంగా జీవించేలా చేస్తా. ప్రజలు స్వేచ్ఛగా బతకాలన్నా, పోలవరం ప్రాజెక్టు పూర్తి కావాలన్నా, అమరావతి నిర్మాణం కావాలన్నా కూటమిని గెలిపించండి'.. అంటూ కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.


కలిదిండి ర్యాలీలో పాల్గొన్న వెంకటేశ్, కామినేని


కైకలూరు ర్యాలీలో వెంకటేశ్, కామినేని

ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై కేంద్ర చీఫ్ ఎలక్షన్ కమిషనర్ సమీక్ష

ఏలూరు సిటీ, మే 8 : నాల్గవ దశలో ఈనెల 13న ఎన్నికలు జరగనున్న 16 రాష్ట్రాలు , కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లను బుధవారం న్యూఢిల్లీ నిర్వచన్ సదన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల సాధారణ, వ్యయ , పోలీస్ పరిశీలకులతో కేంద్ర చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ సమీక్షించారు. నాల్గవ దశ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లును పర్యవేక్షించేందుకు ఎన్నికల సంఘంచే నియమింపబడిన సాధారణ పోలీస్, వ్యయ సెంట్రల్ పరిశీలకులకు దిశా నిర్దేశం చేశారు. ఆయనతో పాటు ఎన్నికల కమిషనర్లు జ్ఞానేష్ కుమార్, డాక్టర్ సుఖ్బీర్ సింగ్ సంధులు పాల్గొన్నారు. ఏలూరు కలెక్టరేట్ ఎన్ఐసీ నుంచి ఉంగుటూరు, దెందులూరు, ఏలూరు అసెంబ్లీ నియోజక వర్గాల ఎన్నికల సాధారణ పరిశీలకులు డా. కృష్ణకాంత్ పాఠక్, పోలవరం , చింతలపూడి , నూజివీడు, కైకలూరు, అసెంబ్లీ నియోజకవర్గాల సాధారణ పరిశీలకులు ఎస్ఏ రామన్, పోలీస్ పరిశీలకులు టి.శ్రీధర్, ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు టి.జోర్డాన్ బూటియా, చింతలపూడి, నూజివీడు , కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు పి.కీర్తినారాయణ్, ఉంగుటూరు , ఏలూరు, దెందులూరు, పోలవరం అసెంబ్లీ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు మేశ్రమ్ గౌతమ్ మధుకర్ హాజరయ్యారు.

సాధారణ ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై సమీక్ష

ఏలూరు సిటీ, మే 8 : జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు పోలింగ్ ప్రక్రియకు అవసరమైన అన్ని ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్నవెంకటేష్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం ఎన్నికల సన్నద్ధత , ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు తదితర అంశాలపై సమీక్షించేందుకు కలెక్టర్, ఎస్పీ మేరీ ప్రశాంతిలతో సాధారణ వ్యయ పరిశీలకులు డా. కృష్ణకాంత్ పాఠక్, ఎస్ఏ రామన్, పోలీస్ పరిశీలకులు టి.శ్రీధర్ సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1,744 పోలింగ్ కేంద్రాల్లో ఈనెల 13న నిర్వహించే పోలింగ్ ప్రక్రియ ఏర్పాట్లను వివరించారు. పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించామన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలీస్ బందోబస్తు, శాంతి భద్రతల వివరాలను ఎస్పీ వివరించారు.

నేటి నుంచి ఐటీఐలలో దరఖాస్తుల స్వీకరణ

ఏలూరు ఎడ్యుకేషన్, మే 8 : జిల్లాలోని 5 ప్రభుత్వ, 14 ప్రైవేటు ఐటీఐలలో తొలివిడత అడ్మిషన్ల కౌన్సెలింగ్‌కు విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా ఈనెల 9నుంచి జూన్ 10వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని ఏలూరు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, కౌన్సెలింగ్ కన్వీనర్ పి.రజిత ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో స్టూడెంట్ ఏరియా ద్వారా దరఖాస్తు చేసుకుని, అప్లికేషన్ ప్రింటవుట్ కాపీని, ఒరిజినల్ సర్టిఫికెట్లను ఏదైనా ప్రభుత్వ ఐటీఐలో జూన్ 10లోగా వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. వెరిఫికేషన్ పూర్తయిన విద్యార్థులనే కౌన్సెలింగ్‌కు పిలుస్తామని స్పష్టం చేశారు. వివరాలకు ప్రభుత్వ ఐటీఐ కార్యాలయ ఫోన్ నెంబరు 08812-230269లో సంప్రదించాలన్నారు. ప్రభుత్వ ఐటీఐలలో 808 సీట్లు, ప్రైవేట్ ఐటీఐలలో 1,672 సీట్లు వివిధ బ్రాంచ్‌లలో అందుబాటులో ఉన్నాయని వివరించారు.

దివ్యాంగురాలిపై అత్యాచారం..

నిందితుడికి పదేళ్ల జైలు

ఏలూరు క్రైం, మే 8 : పుట్టుకతో రెండు కాళ్ళు చచ్చుబడి నడవలేని స్థితిలో వున్న దివ్యాంగురాలిపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి పదేళ్ల జైలుశిక్ష కోర్టు విధించింది. ఏలూరులోని ఒక ప్రాంతానికి చెందిన దివ్యాంగురాలు 2016 ఏప్రిల్ 7న తన ఇంటి వద్ద ఒంటరిగా ఉంది. ఆమె తల్లిదండ్రులు పనులకు వెళ్ళారు. ఏలూరు ఆముదాల అప్పలస్వామి కాలనీకి చెందిన వేముల అప్పనపల్లి అలియాస్ అప్పనపల్లి వెంకటరమణ (35) అనే యువకుడు ఆమె వద్దకు వెళ్ళి ఆమె తల్లి గురించి అడిగాడు. ఆమె లేదని పనికి వెళ్లిందని చెప్పగా ఆమెను ఇంట్లోకి తీసుకువెళ్ళి నోట్లో గుడ్డలు కుక్కి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇంటి బయట మగవారి చెప్పులు ఉండడం గమనించి ఇంటి యజమాని తలుపులు కొట్టడంతో తలుపులు తీసి వేముల అప్పన్నపల్లి పారిపోయాడు. జరిగిన విషయాన్ని దివ్యాంగురాలు తన తల్లికి చెప్పడంతో ఆమె ఫిర్యాదు మేరకు అప్పట్లో ఏలూరు వన్‌టౌన్ ఎస్ఐ రాంబాబు కేసు నమోదు చేయగా వన్‌టౌన్ సీఐ రాజ శేఖర్ చార్జి షీటు దాఖలు చేశారు. ఈ కేసు ఏలూరులోని 5వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి రాజేశ్వరి విచారణ చేశారు. నిందితుడైన వేముల అప్పన్నపల్లిపై నేరం రుజువు కావడంతో పదేళ్ల జైలు శిక్ష, 1500 రూపాయలు జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ డీవీ రామాంజనేయులు వాదించగా ప్రాసిక్యూషన్‌కు వన్‌టౌన్ సీఐ రాజశేఖర్, ఎస్ఐలు ఎన్.లక్ష్మణబాబు, నవీన్ కుమార్, కోర్టు హెడ్‌కానిస్టేబుల్ మల్లిఖార్జునరావు, కానిస్టేబుల్ సంగయ్య, కోర్టు లైజన్ అధికారులు సహకరించారు. ముద్దాయికి శిక్షపడేలా దర్యాప్తు చేసి సకాలంలో సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టి కేసు విచారణకు సహకరించిన పోలీసు సిబ్బందిని, కోర్టు లైజన్ అధికారులను ఎస్పీ మేరీ ప్రశాంతి అభినందించారు.

బాలికపై లైంగిక వేధింపులు

» నిందితుడికి పదేళ్ల జైలు

ఏలూరు క్రైం, మే 8 : నాలుగో తరగతి చదువుతున్న బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఒక యువకుడిపై నేరం రుజువు కావడంతో పదేళ్ల జైలు శిక్ష, వంద రూపాయలు జరిమానా విధిస్తూ ఏలూరులోని పోక్సో కోర్టు జడ్జి బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక ప్రాంతానికి చెందిన బాలిక నాల్గొవ తరగతి చదువుతోంది. ఆమె స్నేహితురాలు స్కూలులో గాజులు తీసుకోవడంతో అవి తెచ్చుకోవడానికి ఆ బాలిక స్నేహితురాలి ఇంటికి వెళ్ళింది. ఆ ఇంటి వద్ద ద్వారకా తిరుమల మండలం పంగిడిగూడెం గ్రామానికి చెందిన మాటూరి భుజంగరావు అనే యువకుడు ఉన్నాడు. అక్కడకు వెళ్ళిన బాలికను అకస్మాత్తుగా ఒక గదిలోకి తీసుకువెళ్ళి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలు తన తల్లికి చెప్పగా ఈ ఘటనపై ఏలూరు రూరల్ పోలీసులకు 2016 జూన్ 18వ తేదీన ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ ఎంవీ సుభాష్ కేసు నమోదు చేయగా, అప్పటి ఏలూరు డీఎస్పీ వెంకటేశ్వరరావు కేసు దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో చార్జిషీటు వేశారు. ఈ కేసు ఏలూరు పోక్సో అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టులో విచారణ సాగింది. నిందితుడిపై నేరం రుజువు కావడంతో పదేళ్ల జైలుశిక్ష, వంద రూపాయలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ డీవీ రామాంజనేయులు వాదించగా ప్రాసిక్యూషన్‌కు ఏలూరు వన్‌టౌన్ సీఐ ఎన్.రాజశేఖర్, ఏలూరు రూరల్ ఎస్ఐ కె.రాజారెడ్డి, కోర్టు కానిస్టేబుల్ సురేంద్రబాబు, కోర్టు లైజన్ అధికారులు పాల్గొన్నారు. ముద్దాయికి శిక్ష పడేలా దర్యాప్తు చేసి సకాలంలో సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టి కేసు విచారణకు సహకరించిన పోలీసు సిబ్బందిని, కోర్టు లైజన్ అధికారులను ఎస్పీ మేరీ ప్రశాంతి అభినందించారు.

ఆగిఉన్న వ్యాన్‌ను ఢీ కొన్న ఆటో

» ఎనిమిది మందికి తీవ్ర గాయాలు..
మరో ఎనిమిది మందికి స్వల్ప గాయాలు


ప్రమాద దృశ్యం

ఏలూరు క్రైం, మే 8 : తాపీపనుల కోసం తమ గ్రామాల నుంచి వేరే గ్రామానికి ఆటోలో వెళ్తుండగా ఏలూరు సమీపంలోని 16వ నెంబర్ జాతీయ రహదారి మెయిన్ బైపాస్‌లో ఇంజనీరింగ్ కాలేజీ ఎదురుగా రహదారిపై ఎడమ పక్క ఆగి ఉన్న వ్యానును అతి వేగంగా కూలీలతో వస్తున్న ఆటో ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది తీవ్ర గాయాల పాలయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కృష్ణా జిల్లా బాపులపాడు మండలం దొండగుంట్ల గ్రామానికి చెందిన ఆకుల దుర్గా ప్రసాద్ దెందులూరు మండలం సీతం పేటలో తాపీ పనులు చేస్తున్నాడు. అతను 14 మంది కూలీలను రోజూ ఆటోలో తీసుకువెళ్ళి తీసుకొస్తున్నాడు. ఈక్రమంలోనే బుధవారం ఉదయం హనుమాన్ జంక్షన్ నుంచి ఆటోలో కూలీలు బయలుదేరి వెళ్తున్నారు. ఏడు గంటల సమయంలో ఏలూరు సమీపంలోని మెయిన్ బైపాస్‌పై ఆగి ఉన్న వ్యానును ఆటో ఢీకొని బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ హనుమాన్ జంక్షన్‌కు చెందిన గిడుగు శివకృష్ణ, తాపీ మేస్త్రీ దుర్గా ప్రసాద్, వసంతవాడకు చెందిన వెంకటేశ్వరరావు, అప్పల నాయుడు, జీవన్ కుమార్, సుధ, గాడి కృష్ణ, హనుమాన్ జంక్షన్‌కు చెందిన శ్రీనులకు తీవ్ర గాయాలయ్యాయి. ఏలూరు 108 అంబులెన్సు సిబ్బంది హుటాహుటీనా ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఏలూరు ప్రభుత్వ స్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ రిఫర్ చేశారు. ఆటోలో ఉన్న మిగిలిన ఎనిమిది మంది స్వల్ప గాయాల పాలయ్యారు. ఈ ఘటపై ఏలూరు త్రీటౌన్ సీఐ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సుధ, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, కృష్ణ

జిల్లా రెవెన్యూ అధికారిగా నకిలీ పోస్టింగ్ ఆర్డర్

ఇద్దరిపై కేసు నమోదు.. విజయవాడ కేంద్రంగా నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్ల రాకెట్

- మెయిన్‌లో..

ఏలూరు సైకిల్ జోరు



సార్వత్రిక ఎన్నికల్లో పోటీలో ఏడోసారి పోటీ చేస్తున్న అనుభవం ఆయనిది. కాంగ్రెస్.. వైసీపీలో పైచేయిగా ఉండి ఏలూరు స్థానంలో మరెవరికీ చోటు లేకుండా సుదీర్ఘకాలం పాటు ఒకే నియోజకవర్గంలో పోటీ చేసిన నేత. ఎమ్మెల్యే నుంచి ఉపముఖ్యమంత్రి స్థాయికి ఎదిగి, ఈసారి కూడా ఏలూరు బరిలో దిగారు వైసీపీ అభ్యర్థి ఆళ్ళ కాళీకృష్ణ శ్రీనివాస్ అలియాస్ నాని. రాజకీయ ఉద్దండులు తాత, తండ్రి, అన్న నుంచి రాజకీయాన్ని అందిపుచ్చుకున్న నాయకుడు. ఎక్కడ ఎదగాలో మరెక్కడ ఒదిగుండాలో తెలిసి రాజకీయక్షేత్రంలో చక్రం తిప్పే ఉద్దండుడు. తన అన్న, మాజీ ఎమ్మెల్యే బడేటి బుజ్జి మరణానంతరం తెలుగుదేశం పగ్గాలు అందుకున్న రాజకీయ వారసుడిగా అందరిని ఆకట్టుకునే తెలుగుదేశం అభ్యర్థి బడేటి రాధాకృష్ణయ్య అలియాస్ చంటి. వీరిద్దరి నడుమ ఈ సార్వత్రిక ఎన్నికల్లో అమీతుమీ తేల్చుకునే స్థాయి పోరు సాగుతోంది. ఏలూరు నగర ఓటర్లే గెలుపు ఓటములకు అత్యంత కీలకం కాబట్టి ఆ దిశగా గానే వీరిద్దరి ఎత్తులు.. పై ఎత్తులు. తొలిసారి గెలుపు దిశగా బడేటి చంటి అడుగులు.. దీనిని అడ్డుకునేందుకు సీనియర్‌గా ఆళ్ళ నాని ఎత్తుగడలు.

(ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

• దేనికైనా సిద్ధమంటున్న వైసీపీ • ధీటుగా టీడీపీ కూటమి
•నగర ఓటర్లే ఇక్కడ అత్యంత కీలకం

వారసుడొస్తున్నాడు..!

సుదీర్ఘ రాజకీయచరిత్ర కలిగిన ఏలూరు పీఠాన్ని కైవసం చేసుకునేందుకు ఉత్కంఠ పోరు. ఒకరిది రాజకీయ అనుభవం, మరొకరిది రాజకీయ వ్యూహాత్మక అడుగులు. కుటుంబ నేపథ్యం ఒకరిది, రాజకీయపక్షాల సారథ్యం ఇంకొకరిది. ఈ రెండు కుటుంబాలు సుదీర్ఘకాలంగా నువ్వా నేనా అంటూ ఏలూరులో తలపడుతున్నాయి. ఏలూరు నుంచి 2014లో బడేటి బుజ్జి ఎమ్మెల్యేగా తొలిసారి ఎన్నికయ్యారు. అప్పటి వరకు కొనసాగిన ఆళ్ళ నాని ఆధిపత్యానికి బడేటి బుజ్జి బ్రేక్ చేశారు. ఏలూరులో తన ముద్ర వేసుకునే దిశగా వినూత్న అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చేట్టారు. తండ్రి, తాత, రాజకీయ వారసత్వ పోకడలున్న బుజ్జి రాజకీయాల్లో దూకుడు ప్రదర్శించారు. ఉదయం ఆరు గంటలకు క్యాంపు కార్యాలయంలో ప్రజల విజ్ఞప్తులను స్వయంగా తీసుకున్న ఏకైక ఎమ్మెల్యేగా అప్పట్లోనే చంద్రబాబు దృష్టిని ఆకర్షించారు. నిత్యం ప్రజలతో ఉండడం, వారి బాగోగులు, ఆర్థిక సమస్యలు, వైద్య సదుపాయాల కల్పనలో రాత్రి అపరాత్రి తేడా లేకుండా నిమగ్నమయ్యారు. ఆయన మరణానంతరం తెలుగుదేశం సారధ్య బాధ్యతలను బడేటి చంటికి అప్పగించి ఏలూరు నియోజవర్గ కన్వీనరుగా చంద్రబాబు నియమించారు. కరోనా కష్టకాలంలో తనదైన శైలిలో పలువురికి న్యాయం చేశారు. వైసీపీ దుందుడుకు చర్యలకు దిగుతున్నా, కక్ష సాధింపు చర్యలతో అక్రమ కేసులు బనాయిస్తున్నా ఏలూరు నగరం, రూరల్ క్యాడర్‌ను కాలు కదపనీయకుండా నిలువరిస్తూ వైసీపీ బెదిరించినా బడేటి చంటి నేరుగా ఢీకొన్నారు. క్యాడర్‌కు అండగా నిలబడ్డారు. ఏమైనా నేను చూసుకుంటానంటూ భుజం కాశారు. వైసీపీ ఏకపక్ష దూకుడుకు వ్యూహాత్మంగా అడ్డు తగిలారు. క్యాడర్‌పై ఎలాంటి కేసులు బనాయించినా అడ్డుకోవడంలో సక్సెస్ అయ్యారు. దీనితో పార్టీ, ప్రజల్లో బడేటి చంటికి గుర్తింపుతో సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేకి పోటీ చేసే స్థాయికి వచ్చారు. తొలిసారి ఏలూరు బరిలో దిగిన ఆయన ప్రత్యర్థి పార్టీ వైసీపీకి కంటిలో నలుసు అయ్యారు.



ఏలూరు నగరం, రూరల్ మండలం

మొత్తం ఓటర్లు - 2,35,345
పురుషులు - 1,12,426 మహిళలు - 1,22,872

బరిలో అభ్యర్థులు

1. ఆళ్ళ కాళీకృష్ణ శ్రీనివాస్	వైసీపీ
2. రతన్‌కాంత్ అండుగుల	బీఎస్పీ
3. బడేటి రాధాకృష్ణయ్య (చంటి)	టీడీపీ
4. అల్లూరి సత్యనారాయణ రాజు	పిరమిడ్
5. జ్యోషిల ములగల	జై భారత్
6. బండి వెంకటేశ్వరరావు	సీపీఐ
7. మ్యాథి బోడ్డి	రిపబ్లికన్
8. షేక్ హలాస్సేన్	రిఫార్మ్స్
9. జిల్లేలమూడి ఉమామహేశ్వరరావు	స్వతంత్ర
10. తులసీరామ్ పోలిశెట్టి	స్వతంత్ర
11. నాలమెల్లి ప్రసన్నకుమార్	స్వతంత్ర
12. పిట్టా ధనుంజయ్ కుమార్	స్వతంత్ర
13. మచ్చా పెద ముసలనాయుడు	స్వతంత్ర
14. రాజనాల శ్రీనివాసరావు	స్వతంత్ర

వైసీపీని బలహీనపర్చేలా, వారి నైతిక స్థైర్యాన్ని దెబ్బ తీసేలా సీనియర్ నేతలను, పలువురు కార్పొరేటర్లను, ధన బలమున్న క్యాడర్‌ను తనవైపు తిప్పుకుని ఎన్నికల బరిలో తొడ కొట్టారు. గెలుపు ఖాయమని, భారీ మెజార్టీ లక్ష్యమంటున్నారు. బడేటి చంటి, ఆయన మద్దతుదారులు. బీజేపీ, జనసేన బలం కూడా ఆయనకు కలిసొచ్చింది.

కెరటంలా ఎగసి..

యువజన కాంగ్రెస్ నేతగా రాజకీయాల్లోకి అడుగిడి ఏలూరు రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు. మూడవ కంటికి తెలీయకుండా రాజకీయాలు నెరిపే ఆళ్ళ కాళీకృష్ణ శ్రీనివాస్ ఏడోసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఏలూరు బరిలో నిలిచారు. తొలుత కాంగ్రెస్‌లో పూర్తిస్థాయిలో పాగా వేసి అప్పటి జననేత వైఎస్ రాజశేఖరరెడ్డికి శిష్యుడి కొనసాగుతూ 2004, 2009లో ఎమ్మెల్యేగా రెండు సార్లు గెలుపొందారు. వైఎస్ మరణానంతరం కొద్దికాలం కాంగ్రెస్‌లోనే కొనసాగి వైసీపీ ఆవిర్భావంతో ఆ వైపు మళ్లారు. 2014లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఓటమి పొందినా తిరిగి 2019 ఎన్నికల్లో విజయం సాధించి జగన్ మంత్రివర్గంలో చేరారు. ఉప ముఖ్యమంత్రిగా రాజకీయంగా ఎదిగారు. తన సొంత క్యాడర్‌ను బలోపేతం చేసుకునే ప్రయత్నం చేశారు. కరోనా సమయంలో తన వంతు పాత్ర ఉండేలా జాగ్రత్త పడ్డారు. అయినప్పటికీ ఆయన కోటరీలో ముఖ్యులు కొందరు ఏకపక్షంగా వ్యవహరించడం, అంతా తన కన్నుసన్నల్లోనే జరగాలన్న వ్యక్తిగత పట్టుదల ఆళ్ళ నాని నాయకత్వంలో కాస్తంత నిశ్శబ్దాన్ని ఛేదించినట్లయింది. కొందరు సీనియర్లు, అత్యంత సన్నిహితులు పార్టీని వీడారు. కుడి ఎడమ భుజాలుగా వున్న మరి కొందరు పక్కకు జరిగారు. మంత్రి పదవి ఆరంభం నుంచి, ఆ తరువాత కూడా ఆళ్ళ నానికి ప్రజలకు మధ్య సన్నిహిత సంబంధాలు చెదిరాయి.

ఏలూరు బరిలో కాంగ్రెస్ పొత్తులో సీపీఐ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావు, ఇతర పార్టీలు, స్వతంత్రులు ఉన్నారు. జర్నలిస్టుగా, వామపక్షాల ప్రతినిధిగా బండి వెంకటేశ్వర రావు అనేక పోరాటాల్లో స్ఫూర్తిదాయకంగా నిలిచారు. ఏఐటీయూసీలోనూ కీలక నేతగా, సీపీఐలో రాష్ట్ర స్థాయి కంట్రోల్ స్థాయికి ఎదిగారు. మారిన పరిస్థితులు, కాంగ్రెస్‌లో పుంజుకున్న రాజకీయ బలంతో బండి వెంకటేశ్వరరావు ఎన్నికల సమరానికి సిద్ధమయ్యారు.



బడేటి రాధాకృష్ణ (చంటి)
టీడీపీ కూటమి

బలాబలాలు
- సుదర్ఘీ రాజకీయ కుటుంబ నేపథ్యం
- అందరికీ అందుబాటులో ఉండటం
- నిర్ణయాల్లో అచితూచి వ్యవహరించడం
- సోదరుడు బుజ్జి ఇమేజి కలిసి రావడం
- నగరాభివృద్ధిపై అవగాహన, కాంక్ష.
- నగర ఓటర్ల ఆకర్షణ

బలహీనతలు
- తను ఇష్టపడే కార్యకర్తలకు ఎవరైనా అడ్డు తగిలితే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించలేరు.
- వ్యక్తిగతం కంటే పార్టీ ముఖ్యమనే ఆలోచన



ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్ (నాని)
వైసీపీ

బలాబలాలు
- నగరంలో అత్యధిక ఇళ్లు, స్థలాలు సమకూర్చడం
- పార్టీలో తన మాటే చెల్లుబాటు అయ్యే ధోరణి

బలహీనతలు
- తోడుగా ఉన్నవారు జారుకోవడం
- నగరంలో క్రమేపీ పట్టుకోల్పోవడం
- ప్రజలకు అందుబాటులో లేకపోవడం
- వ్యక్తిగత నష్టానికి దారి తీసిన కోటరీ
- కొన్ని వర్గాల మద్దతుపైనే ఆశలు

పోలింగ్.. తెలుసుకోండి




పోలింగ్ ఏ కారణం చేతనైనా ఆలస్యమైతే ఒక్క నిముషం కూడ పొడిగించరు. పోలింగ్ ముగింపునకు నిర్దేశించిన నిర్ణీత సమయానికి క్యూ లైన్‌లో ఉన్న వారందరికీ ఓటు వేసేందుకు అనుమతిస్తారు. పోలింగ్ కేంద్రం, వంద మీటర్ల దూరంలో కానీ అభ్యర్థితోపాటు ఎవరూ కూడ ఫలానా గుర్తుకు ఓటేయమని చెప్పకూడదు. ఏదైనా కారణంతో ఓటింగ్‌ను గ్రామాల్లోని ఓటర్లందరూ బహిష్కరించినా రీ పోలింగ్ జరుగదు. ఓటు వేసేటప్పుడు పోలింగ్ కేంద్రంలో వీడియో చిత్రీకరణ, ఫొటోలు తీయటం నిషేధం. పోలింగ్ కేంద్రంలోకి అభ్యర్థితోపాటు గన్‌మెన్‌కు అనుమతి లేదు. గన్‌మెన్ తన ఆయుధాన్ని బయట పోలీసులకు అప్పగించి ఓటు వేసేందుకు వెళ్లవచ్చు. పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్‌కు సంబంధించిన నిబంధనలు అందరూ పాటించాలి.

సిరా చుక్క ఇలా..




ఓటు వేసే ముందు పోలింగ్ కేంద్రంలో ప్రతీ ఓటరుకు ఎడమ చేయి చూపుడు వేలుపై సిరా చుక్క గుర్తుగా పెడతారు. ఓటరుకు ఎడమచేతికి చూపుడు వేలు లేకపోతే ఏ వేలుకు సిరా చుక్క పెట్టాలి. ఎన్నికల తొలినాళ్లలో ఎన్నికల సంఘానికి ఎదురైన ప్రశ్న ఇది. అప్పట్లో దీనికి ఒక ప్రత్యామ్నాయ విధానాన్ని చూపించారు. ఎడమ చేతికి చూపుడు వేలు లేకపోతే మధ్య వేలికి, అదీ లేకపోతే బొటన వేలికి సిరా చుక్క పెట్టే అవకాశం కల్పించారు. అసలు ఎడమ చేతికే వేళ్ల లేకపోతే కుడి చేయి చూపుడు వేలికి, అదీ లేకపోతే మధ్య వేలికి అది కూడ లేకపోతే ఉంగరం వేలు, దీనికి కూడ అవకాశం లేకపోతే చిటికిన వేలు, బొటన వేలుకు సిరా చుక్క పెడతారు. ఇక్కడ వరకు ఏదో ఒక వేలికి చుక్క పెడదాంలే అనుకుంటే మళ్లీ ఇంకో పెద్ద చిక్కు. ఎడమ, కుడి చేతులకు వేళ్ల లేకపోతే ఏం చేయాలి. చేతిపై వేళ్ల మొదలు మధ్య భాగంలో లేదా చేయిపై భాగంలో కనిపించే విధంగా సిరా చుక్క పెట్టే వెసులుబాటును ఎన్నికల సంఘం కల్పించింది. ఇదీ సిరా చుక్క వేళ్ల కథ. **- ముదినేపల్లి**

మీకే మా ఓటు..!



ఎన్నికల వేళ విచిత్ర పరిస్థితులు నెలకొన్నాయి. ఏ పార్టీ నాయకుడు పిలిచినా ర్యాలీలు, ప్రచారానికి హాజరు అవుతున్నారు. ప్రత్యర్థి నేత ప్రశ్నిస్తే ఇంటికి వచ్చి పిలిచారు, కాని మా ఓటు మాత్రం మీ పార్టీకే బాబు అని సమాధానం ఇస్తున్నారు. దీంతో వారు ఎవరికి ఓటు వేస్తారోనన్న అయోమయం అభ్యర్థుల్లో నెలకొంది. ఓటర్ల నాడిపట్టలేక అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తమకు ఇబ్బంది ఉండకూడదన్న ఉద్దేశంతోనే ఈ పరిస్థితి నెలకొంది. ఈ జాబితాలో పురుషులతో పాటు మహిళలు కూడా చేరిపోయారు. ప్రస్తుతం గ్రామాలు నగరాల్లో టీడీపీ, కాంగ్రెస్, వైసీపీ నేతల ప్రచారం పోటాపోటీగా సాగుతోంది. కొందరు ప్రచారాలకు బహిరంగంగా వెళ్లి మద్దతు పలికి ర్యాలీ ప్రచారాల్లో పాల్గొంటున్నారు. సర్వే చేసే వారు ప్రశ్నిస్తే పార్టీలది ఏముంది, ఎన్నికల రోజు మాకు ఇష్టంవచ్చిన వారికి ఓటువేస్తాం అంతవరకు ఏ ఒక్క పార్టీ నేతలకు చెడ్డకాకూడదు కదా అంటున్నారు. **- ఏలూరు రూరల్**

పందెం అంటే పరార్..!



ఎన్నికల పందేలు జోరందుకున్నాయి. ఎక్కడ చూసినా పందేల మాటే ఉంటుంది. కానీ తాడేపల్లిగూడెంలో పందెంరాయుళ్లకు చిక్కు వచ్చిపడింది. ఎక్కడ పందేలు వేద్దామన్నా ఎవరూ ముందుకు రావడం లేదు. ఎన్నికల్లో పార్టీలు హోరా హోరీ తలపడుతున్నారు. పందెం రాయుళ్ల కూటమి తరపున పందేలకు సిద్ధపడితే అవతలి వైపు పందెం దొరకడం లేదంటూ తెగ వెతికేస్తున్నారట. ఒక వేళ అవతలి వైపు సానుకూలంగా మాట్లాడే వారిని రెచ్చగొట్టి రంగంలోకి దింపుదామనుకున్నా కూడా ఏదో సాకు చెప్పి పారిపోతున్నారట. పాపం కూటమి తరపున పందేలు కాసేవారికి అవతలివైపు పందేలు దొరక్కపోవడం అంటే చాలా పెద్దకష్టమే.

- తాడేపల్లిగూడెం రూరల్

భీమవరం జనసైన్యమే..



భీమవరం జిల్లా కేంద్రమే కాదు ఆర్థిక రాజధానిగా గుర్తింపు తెచ్చుకుంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రాష్ట్ర రాజకీయాలు, ప్రభుత్వ పాలనపై బల్లగుద్ది చెప్పే నాయకులు భీమవరం సొంతం. ఇక్కడ ఏ పార్టీ విజయం సాధిస్తే రాష్ట్రంలో ఆ పార్టీదే అధికారమనే సెంటిమెంట్ ఉంది. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి తరపున జనసేన అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు), వైసీపీ నుంచి గ్రంధి శ్రీనివాస్ మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. వ్యూహ, ప్రతివ్యూహాలతో కూటమి, వైసీపీ నియోజకవర్గంలో కాకపుట్టిస్తున్నాయి. కొదమ సింహాల్లా ఇద్దరు అభ్యర్థులు కాలు దువ్వుతున్నారు. ప్రభుత్వ వ్యతిరేకత గ్రంధి శ్రీనివాస్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అనూహ్యంగా చివరి దశలో టిక్కెట్ దక్కించుకున్న అంజిబాబు అనతి కాలంలోనే జనంలోకి చొచ్చుకుపోయారు. అంజిబాబు మంచితనం, గ్రంధి శ్రీనివాస్ దురుసుతనం జనంలో చర్చనీయాంశమైంది. మంచితనమే భీమవరంలో అంజిబాబు వైపు గాలివీచేలా చేసింది. మరోవైపు ప్రభుత్వంపై వ్యతిరేకత, కూటమిపై సానుకూలత అంజిబాబుకు కలసి వస్తున్నాయి.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

• హామీలు నెరవేర్చలేక చతికలపడ్డ వైసీపీ
• టీడీపీ, బీజేపీ ఐక్యంగా కదలడంతో జనసేన దూకుడు



పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) టీడీపీ కూటమి

బలాబలాలు
- తెలుగుదేశం, జనసేనకు ఉన్న బలమైన ఓటు బ్యాంక్
- పదేళ్ల ఎమ్మెల్యేగా భీమవరం నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి
- రాజకీయాలకంటే పనికే ప్రాధాన్యం
- సామాన్యుడు వెళ్లినా సరే పని చేసే తత్వం

బలహీనత
- అతిమంచితనం
- కార్యకర్తల ప్రయోజనం కంటే నియోజకవర్గ ప్రయోజనాలే ఎక్కువగా భావించడం



గ్రంధి శ్రీనివాస్
వైసీపీ

బలాబలాలు
- వైసీపీ ఓటు బ్యాంక్
- కార్యకర్తలను కాపాడుకునే స్వభావం
- కార్యకర్తలకు అందుబాటులో ఉండడం

బలహీనత
- హామీలు నెరవేర్చలేకపోవడం
- వైరిపక్షాలను అణచివేయాలన్న కసి
- కోటరీపై ఆధారపడడం

గడచిన సార్వత్రిక ఎన్నికల్లో జనసేన నుంచి పవన్ కల్యాణ్, తెలుగుదేశం పార్టీ తరపున అంజిబాబు, వైసీపీ నుంచి గ్రంధి శ్రీనివాస్ పోటీ చేశారు. త్రిముఖ పోరులో గ్రంధి విజయం సాధించారు. అప్పటి ఎన్నికల్లో భీమవరం నియోజకవర్గానికి ఆయన పలు హామీలు ఇచ్చారు. వాటిని నెరవేర్చలేకపోయారు. పట్టణంలో ప్రధాన సమస్య అయిన డంపింగ్ యార్డు నిర్మించలేదు. యనమదుర్రు డ్రెయిన్‌పై వంతెనలకు అప్రోచ్‌లు ఏర్పాటు చేయలేకపోయారు. యనమదుర్రు కాలుష్య నివారణకు తెలుగుదేశం హయాంలో రూ. 100 కోట్లు మంజూరు చేస్తే వైసీపీ ప్రభుత్వం దాని ఊసెత్తలేదు. టిడ్కో ఇళ్లు అందరికీ ఉచితంగా ఇస్తామన్నారు. తుంగలో తొక్కారు. మంచినీటి వసతిని పూర్తి స్థాయిలో అందించలేకపోతున్నారు. ప్రభుత్వ పరంగా భీమవరం నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు పైసా మంజూరు కాలేదు. ప్రజలు కట్టే ఆస్తిపన్ను తోనే పట్టణంలో కాస్త రహదారులు వేశారు. జిల్లా కేంద్రమైనప్పటికీ భీమవరం పట్టణానికి పెద్ద ఒరిగేదేమీ లేకుండా పోయింది. ఇవన్నీ ఇప్పుడు వైసీపీకి వ్యతిరేక ప్రభావం చూపుతున్నాయి.

కక్ష పూరిత రాజకీయాలు

గడచిన ఐదేళ్లలో భీమవరంలో కక్ష పూరిత రాజకీయాలు సాగాయి. తెలుగుదేశం నాయకులపై కేసులు నమోదు చేశారు. దాడులకు ఉసిగొల్పారు. పోలీసుల అండతోనే పాలన సాగింది. తెలుగుదేశంలో ఉన్న బిసి నాయకులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులు కూడా నమోదు చేశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రతిపక్ష నాయకులను కట్టడి చేసే ప్రయత్నాలే ఎక్కువగా సాగాయి. అధికార పార్టీని గానీ, నేతలను గాని విమర్శలు చేయాలన్నా.. అభివృద్ధిపై ప్రశ్నించాలన్నా ధైర్యం చేసే పరిస్థితి లేకుండా పోయింది. తెలుగుదేశం, జనసేన నాయకుల అపార్ట్‌మెంట్‌లలో అతిక్రమణలు ఉన్నాయంటూ ధ్వంసం చేసేలా చర్యలు తీసుకున్నారు. కూరగాయల వ్యాపారిని విడచిపెట్టలేదు. ఇలా ఐదేళ్లు తెలుగుదేశం, జనసేన శ్రేణులపై కక్ష తీర్చుకునే రాజకీయాలే సాగాయి. ఈ సారి అంజిబాబును నెగ్గించుకోవాలన్న కసిని కూటమిలో ఏర్పడడానికి గ్రంధి అనుసరించిన రాజకీయ వైఖరే దోహదపడింది.

వైసీపీ నుంచి వలసలు

వైసీపీ నుంచి వైదొలుగుతున్న నేతల సంఖ్య పెరుగుతోంది. సర్పంచ్‌లు, మాజీ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జిలు అనేక మంది నాయకులు తెలుగుదేశం, జనసేన పార్టీలో చేరారు. ఇంకా చేరుతూనే ఉన్నారు. వైసీపీలో క్రియాశీల నాయకులు కూడా అంటీముట్టనట్టు ఉంటున్నారు. గృహ సారథులు, వాలంటీర్లే ఇంటింటికి తిరిగి వైసీపీ తరపున ప్రచారం చేస్తున్నారు. ర్యాలీలు, రోడ్ షోలు, ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నా స్పందన అంతంత మాత్రం. కూటమి అభ్యర్థి అంజిబాబుకు విశేష ఆదరణ లభిస్తోంది. దీనితో వైసీపీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది.

అందరివాడు అంజిబాబు

తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిలో అంజిబాబు అందరివాడుగా పేరొందారు. తెలుగుదేశం ఎమ్మెల్యేగా అందరితో సఖ్యత పాటించారు. పార్టీలకు అతీతంగా ఎవరు వెళ్లినా పనిచేసి పెట్టారు. రాజకీయాల కంటే అభివృద్ధికే ప్రాధాన్యం ఇచ్చారు. అదే ఇప్పుడు అంజిబాబుకు నియోజకవర్గంలో సానుకూలంగా మారింది. కూటమి నాయకులు అండదండలు సంపూర్ణంగా ఉన్నాయి. వ్యక్తిగతంగా మంచివాడన్న అభిప్రాయం జనంలో ఉంది. నెల రోజుల క్రితమే అంజిబాబు జనసేనలో చేరి టిక్కెట్ దక్కించుకున్నారు. అయినా జనంలోకి శరవేగంగా చొచ్చుకుపోయారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ శ్రేణులు తమ సొంత ఎన్నికల్లా పనిచేస్తున్నాయి. ప్రజల్లోనూ ఆదరణ లభిస్తోంది. రోడ్ షోలు, ర్యాలీలు ఊహించిన దానికంటే విజయవంతమవుతున్నాయి. చదువుకున్న యువత స్వచ్ఛందంగా జనసేన జెండాలు పట్టుకుని పట్టణం, గ్రామాల్లో తిరిగి ప్రచారం చేస్తున్నారు. అన్ని వర్గాల్లోనూ అంజిబాబుకు మద్దతు ఉంటోంది. వైసీపీ ప్రభుత్వంపైనా, స్థానికంగా గ్రంధి శ్రీనివాస్‌పైనా ఉన్న వ్యతిరేకత ఇప్పుడు కూటమికి కలసి వస్తోంది.



భీమవరం నియోజకవర్గం
భీమవరం, వీరవాసరం మండలాలు

మొత్తం ఓటర్లు: 2,53,116, పురుషులు: 1,22,790, స్త్రీలు: 1,30,275, ఇతరులు: 51

బరిలో అభ్యర్థులు

1. అంకెన సీతారామ్	కాంగ్రెస్
2. గ్రంధి శ్రీనివాస్	వైసీపీ
3. బుగ్గే రేచర	బీఎస్పీ
4. అల్లూరి శ్రీనివాసరాజు	పిరమిడ్ పార్టీ
5. కడియం రామాంజనేయులు	జాతీయ జనసేన
6. దండు శ్రీనివాసరాజు	ఫార్వర్డ్ బ్లాక్
7. వడ్డి కాసులు	భారత చైతన్య యువజన పార్టీ
8. రామాంజనేయులు	నవరంగ్ కాంగ్రెస్
9. బస్వాని పవన్ కుమార్	జై భీమ్‌రావ్
10. పులపర్తి రామాంజనేయులు	జనసేన
11. ఏడుకొండలు	స్వతంత్ర
12. గుగ్గిలపు రామకృష్ణ	స్వతంత్ర
13. చామకూరి కుసుమకుమారి	స్వతంత్ర
14. మండవ నాగేశ్వరరావు	స్వతంత్ర
15. మెహర్ మనోహర్	స్వతంత్ర

ఆయన విజయం సాధిస్తారు

ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి కృష్ణ తులసి



ఎన్నికల్లో తణుకు అసెంబ్లీ స్థానం నుంచి టీడీపీ కూటమి తరపున పోటీ చేస్తున్న ఆరిమిల్లి రాధాకృష్ణ విజయం తథ్యమని ఆయన సతీమణి ఆరిమిల్లి కృష్ణతులసి అన్నారు. నియోజకవర్గంలో అశేష ప్రజాభిమానం ఇందుకు నిదర్శనం అన్నారు. నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారంలో పాల్గొన్న ఆమె అన్ని వర్గాల ప్రజలు, ప్రధానంగా మహిళలు నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. ఆమె మాటల్లోనే..

ఎన్నికల్లో మీ భర్త విజయానికి మీ కృషి..?

ఆయన విజయానికి క్షేత్రస్థాయిలో కృషి చేస్తున్నా. అభ్యర్థిత్వం ఖరారైనప్పటి నుంచి పరిస్థితులు అవగాహన చేసుకుని, చర్చించి సమష్టిగా నిర్ణయం తీసుకుంటాం.

ఎన్నికల సమయంలో కుటుంబ వ్యవహారాలు..?

ఎన్నికలకు, కుటుంబ వ్యవహారాలకు ఎలాంటి సంబంధం లేదు. ఎన్నికల పనులతో పాటు కుటుంబ వ్యహారాలు సమాంతరంగానే చేస్తాను. ఎన్నికల పనుల్లో తలమునకలైనా కుటుంబానికి ప్రాధాన్యమిస్తా.

విస్తృతంగా ప్రచారంలో పాల్గొంటున్నారు.. ఇబ్బందులు..?

ప్రతి రోజు ఉదయం, సాయంత్రం రెండు పూటలు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నాను. ప్రజల్లో మంచి స్పందన వస్తుంది. ముఖ్యంగా మహిళలు తనకు ఎదురొచ్చి మరీ సంఘీబావం ప్రకటిస్తున్నారు. ఏ గ్రామం, పట్టణం వార్డు అయినా అదే స్పందన. ఏమాత్రం ఇబ్బందులు లేవు.

మీ భర్త విజయం సాధిస్తారా..?

విజయం సాధించడం ఖాయం. ఆయన గతంలో ఎమ్మెల్యేగా చేసిన అభివృద్ధికి ఇప్పటికి ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి చేయకపోగా అవినీతి, అరాచకాలను ప్రజలే చెబుతున్నారు.

మీ భర్త మహిళలకు ఏం చేయాలని సూచిస్తారు..?

నియోజకవర్గంలో మహిళలకు ఆయన పెద్దన్న. మహిళల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని చెబుతా. నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఏర్పాటు చేసి అన్ని వర్గాల మహిళలకు విద్యార్హతను బట్టి ఉచిత శిక్షణ, ఉద్యోగ, వ్యాపార అవకాశాలు కల్పించాలని సూచిస్తా. స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు మార్కెటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయిస్తా.



ధర్మవరంలో ముప్పిడికి గజమాల వేసిన నాయకులు

అరాచక పాలన అంతమయ్యే సమయం వచ్చింది..

కొవ్వూరు అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, మే 8: రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టేసిన వైసీపీ అరాచక పాలనను అంతమొందించే సమయం ఆసన్నమైందని టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు మండలం ఐ.పంగిడి, దేచర్ల గ్రామాల్లో బుధవారం ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్న లగడ్డ సుబ్బరాయచౌదరి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం జరిపారు. కూటమి అభ్యర్థులు ముప్పిడి, పురందేశ్వరిలకు మద్దతుగా గ్రామంలో మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు మోటారుసైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. ముప్పిడి ఇంటింటికీ వెళ్లి కూటమి మేనిఫెస్టోను వివరించి, సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ముప్పిడి మాట్లాడుతూ ఐదేళ్లుగా రాష్ట్రాన్ని వైసీపీ నేతలు అన్నిరకాలుగా దోచుకున్నారన్నారు. కూటమి అధికారంలోకి వస్తే మహిళలకు ఉచిత ఆర్టీసి ప్రయాణం, సంవత్సరానికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, స్కూల్‌కు వెళ్లే పిల్లలందరికి ఏడాదికి రూ.15 వేలు, ప్రతి మహిళకు నెలకు రూ.1500 వంటి సక్షేమ పథకాలు అందించనున్నామన్నారు. పొట్రు సిద్ధూ, జొన్నా బాలకృష్ణ, శివ, కొప్పాక విజయకుమార్, రంగారావు, పెరుగు పోతురాజు, కోమటి కృష్ణంరాజు పాల్గొన్నారు.

కూటమితోనే రాష్ట్ర పునః నిర్మాణం : అచ్చిబాబు



కొవ్వూరు మండలం పెనకనమెట్టలో ప్రచారం నిర్వహిస్తున్న అచ్చిబాబు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునః నిర్మాణం ఎన్డీఏ కూటమితోనే సాధ్యమని కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకులు పెండ్యాల అచ్చిబాబు అన్నారు. కొవ్వూరు మండలం పెనకనమెట్టలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో అచ్చిబాబు మాట్లాడుతూ ఐదేళ్లుగా వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాలలో నష్ట పోయిందన్నారు. అరాచకపాలన సాగించిన జగన్మోహనరెడ్డిని ఇంటికి సాగనంపాలన్నారు. మన పిల్లల భవిష్యత్ కోసం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న ముప్పిడి వెంకటేశ్వరరావుకు సైకిల్ గుర్తుపై, పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేస్తున్న దగ్గుబాటి పురందేశ్వరికి కమలం గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలన్నారు.సర్పంచ్ మేకల ఎను, ఎంపీటీసీ పసలపూడి తాతారావు, అచ్చుతరాయుడు, గూడపాటి రాధాకృష్ణ, తాడి సత్తికొండ, కోడి బ్రహ్మకృష్ణ, కె.విజయలక్ష్మి, కొడమంచిలి వెంకటేశ్వరరావు, సోమలక్ష్మి, మైగాపుల బాలకృష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పురందేశ్వరికి లాండ్ టైట్లింగ్ చట్టంపై వినతిపత్రం ఇస్తున్న న్యాయవాదులు

ఓటుతో వైసీపీకి బుద్ధి చెప్పాలి

రాజమహేంద్రవరం కూటమి అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి

కొవ్వూరు, మే 8: ఐదేళ్ళగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న వైసీపీ ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పాలని రాజమహేంద్రవరం పార్లమెంటు కూటమి అభ్యర్థి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. కొవ్వూరు పట్టణంలో బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా పలు సంఘాల నాయకులను కలుసుకున్నారు. వారి సమస్యలను తెలుసుకుని ఎన్నికల మేనిఫెస్టోను వివరించారు. కొవ్వూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు పురందేశ్వరిని కలిసి లాండ్ టైట్లింగ్ చట్టాన్ని రద్దుచేయాలని వినతిపత్రాన్ని అందజేశారు. వై.చలపతి, పిల్లలమర్రి మురళీకృష్ణ, పరిమి రామారాయుడు, తక్కెళ్ళ చిట్టిబాబు, రమణమూర్తి, దుగ్గిరాల తాతారావు, తదితరులు పాల్గొన్నారు. కొవ్వూరు బ్రాహ్మణ సామాజిక భవన నిర్మాణానికి సహకరించాలని సంఘం నాయకులు కోరారు. సంఘం అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, మురళీకృష్ణ, రంగావఝ్ఝల నాగభూషణశర్మ, కలిగొట్ల కృష్ణారావు, ఆర్.కామేశ్వరశర్మ తదితరులు పురందేశ్వరిని సత్కరించారు. కోలాట, భజన సంఘాలతో ఆమె సమావేశమయ్యారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు పరిమి రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

ఉండిలో సిబ్బందికి మాక్ పోలింగ్



శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ ,జేసీ ఆదిత్య

భీమవరం టౌన్, మే 8 : 13న జరగనున్న ఎన్నికలను పీవోలు, ఏపీవోలు సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టరు, జిల్లా ఎన్నిక అధికారి సుమిత్ కుమార్ తెలిపారు. బుధవారం ఉండి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రిసైడింగు, సహాయ ప్రిసైడింగ్, సెక్టోరల్ అధికారులకు మాక్ పోల్/పోలింగ్ నిర్వ హణపై శిక్షణ తరగతులను ఉండి అసెంబ్లీ నియో జకవర్గ రిటర్నింగ్ అధికారి ప్రవీణ్ ఆదిత్యతో కలసి నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పీవోలు, ఏపీవోలు సమన్వయంతో పని చెయ్యాలన్నారు. ఈనెల 13న జరిగే పోలింగ్ ప్రక్రియకు సంబంధించి అవసరమైన అన్ని విషయా లను క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. పోలింగు కేంద్రాల వద్ద ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఎన్నికల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి మంచి ఫలితాలు తీసుకురావాలన్నారు. ట్రైనర్స్/సెక్టార్ అధికారులు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఉండి, కాళ్ళ ఆకివీడు, పాలకోడేరు మండలాల పీవోలు, ఏపీవోలు, పాల్గొన్నారు.



ఉండి మండలం ఎన్ఆర్‌పీ అగ్రహారంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఎస్పీ డాక్టర్ అజిత

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి : ఎస్పీ అజిత

ఉండి, మే 8: జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు పశ్చిమ జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత తెలిపారు. బుధవారం ఉండి మండలం ఎన్ఆర్‌పి అగ్రహారంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాన్ని ఆమె పరిశీలించి తగిన సూచనలు అందించారు. పోలింగ్ కేంద్రం చుట్టూ పటిష్ఠ బందోబస్తు, తగిన లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సీఐ సత్యనారాయణ, ఎస్ఐ లక్ష్మణ్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



సహకారం సున్నా..?

సహకార సంఘాల నుంచి రైతులకు ప్రోత్సాహం తగ్గింది..పాలకవర్గాలు లేకపోవడం వలన రైతులకు సబ్సిడీ రుణాలు, ఇతర రుణాలు పొందలేక పోతున్నాం. పాలకవర్గం ఉంటే ఆ పాలకవర్గంలో మా గ్రామం నుంచి ఎవరైనా ఉంటే సహకారం అందేది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీలో వైసీపీ నాయకులు, కార్యకర్తలే సభ్యులుగా ఉంటున్నారు. సహకార సంఘాలను పూర్తిగా నిర్వీర్యం చేశారని అప్పారావు అనే రైతు వాపోయాడు.

సహకార సంఘాలకు పాలకవర్గాలు లేకపోవడంతో రైతులు రుణాలు తీసుకోవడం తగ్గింది. డిపాజిట్లు కూడా తగ్గాయి. పాలకవర్గంలో చైర్మన్, డైరెక్టర్‌లు వారి బంధువులు, తెలిసిన వారి చేత డిపాజిట్లు చేయిస్తారు. ఎరువులు విక్రయాలు తగ్గిపోయాయి. దానివల్ల సహకార సంఘాల ఆదాయం తగ్గిపోయింది. ఐదేళ్ళలో సహకార సంఘాలు ముందుకు వెళ్లాల్సింది పోయి అక్కడే ఉండిపోయాయని మండలంలోని ఒక సహకార సంఘ మాజీ డైరెక్టర్ నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు.

సహకార సంఘాలను నిర్వీర్యం చేసిన ప్రభుత్వం

ఐదేళ్లుగా పాలకవర్గాలకు ఎన్నికలు లేవు

త్రిసభ్య కమిటీల పేరిట తమ పార్టీ వారికి పదవులు

సొసైటీల ఆదాయానికి గండి

రైతులకు అందని ప్రోత్సాహం

భీమవరం రూరల్, మే 8 : రైతులకు వ్యవసాయంలో అన్ని విధాలుగా చేయుతనిచ్చే సహకార సంఘాలకు ఉతమే లేకుండా పోయింది. వైసీపీ ప్రభుత్వం అన్ని రంగాలను ముంచినట్లుగానే సహకార సంఘాలను ముంచేసింది. సహకార సంఘం పాలకవర్గాలు లేకపోవడం రైతులకు సహకరించే నిర్ణయాలు కరువయ్యాయి. దీంతో ఐదేళ్లలో సహకార సంఘాలు రైతులకు సహకారం అంతంతగానే ఉండటంతో పాటు సంఘాల అభివృద్ధికి ఆమడ దూరంలోనే నిలిచిపోయాయి. ఈ ఐదేళ్ళలో వైసీపీ ప్రభుత్వం సహకార సంఘాలకు పాలకవర్గం ఎన్నికల నిర్వహించలేదు. వైసీపీ నాయకులతో త్రిసభ్య కమిటీల ఏర్పాటు చేసి ఐదేళ్ల గెంటేసింది. ఎన్నికలు లేకుండా సహకార సంఘాలు నడిపించడం వైసీపీ నాయకులకు పదవులు ఇవ్వడానికే తప్ప రైతులకు మేలు చేసేందేమీ లేదనే విమర్శలు వచ్చాయి.

ఎన్నికలకు ఎందుకు వెళ్లలేదో

టీడీపీ ప్రభుత్వం హయాంలో సహకార సంఘాల పాలకవర్గాల సమయం ముగియడంతో పాలకవర్గ సమయం ఒక ఏడాది పొడిగించారు. తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చాక కూడా ఎన్నికలు నిర్వహించలేదు. ఈ ఐదేళ్ల పాటూ త్రిసభ్య కమిటీలు వేసి వాటిని పొడిగిస్తూ సభ్యులు, అధ్యక్షుడిని మార్చుతూ వచ్చారు. లక్ష మంది రైతులు ఓటు వేసే అవకాశం కోల్పోయారు. ఐదేళ్లలో పాలకవర్గాలు లేని సహకార సంఘాలుగా నిలిచాయి. దీంతో రైతులకు నష్టం చేసినట్లయ్యింది. పాలకవర్గంలో పదికిపైగా డైరెక్టర్‌లు, అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు ఉంటారు. డైరెక్టర్‌లను గ్రామాల్లో రుణం పొందిన రైతులు ఓట్లు వేసి ఎన్నుకుంటారు. అందువల్ల రైతులు ఆ డైరెక్టర్ ద్వారా బ్యాంక్‌లో సాగుకు అవసరమైన సౌకర్యాలు పొందుతారు. ఏ ప్రాంత డైరెక్టర్ వాళ్ల రైతులకు సహకరిస్తారు. అలాంటిది పాలకవర్గం, డైరెకర్లు లేకపోవడం రైతులు బ్యాంకు నుంచి సరైన సేవలు అందుకోలేకపోయారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీలో అధ్యక్షుడు, ఇద్దరు సభ్యులు ఉంటారు. రైతులకు వేరే ప్రాంత సభ్యుడు అవడం వల్ల వారు ఉన్నా లేనట్లయింది.

బ్యాంకులు వెనుకబడ్డాయి

పాలకవర్గాలు ఉంటే మూడు నెలలకు ఒకసారి పాలకవర్గం సమావేశాలు నిర్వహించేది. రుణ పరిమితి పెంచడం, బ్యాంకులో డిపాజిట్లు ఎలా చేయించాలి.. రైతులకు సహకార సంఘం ద్వారా చేయుత ఎలా ఇవ్వాలి బ్యాంకు ఆదాయం ఎలా పెంచాలనే నిర్ణయాలు తీసుకునేవారు. అవి ఏమీ లేకుండానే ఐదేళ్ల త్రిసభ్య కమిటీలతో నడిచాయి. కొంతమంది రైతులు సహకార సంఘాలను వదిలి వాణిజ్య బ్యాంకులకు వెళ్ళినవారు ఉన్నారు.

ఎరువుల ఆదాయానికి గండి

వైసీపీ ప్రభుత్వం సహకార సంఘాలకు ఊతం ఇవ్వకపోగా ఆదాయానికి గండి కొట్టింది. జిల్లాలోని 114 సహకార సంఘాలలో ఎరువులు విక్రయాలు సార్వా, దాళ్వాలకు జోరుగా సాగేది. ఏడాదికి సుమారు రూ.5 కోట్లు వరకు ఎరువులు ఆదాయం కింద వచ్చేది. ఎరువులు అప్పుగా ఇవ్వడం వల్ల వడ్డీ కూడా బ్యాంకుకు వచ్చేది. అలాంటిది ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలు పెట్టి వ్యవసాయ సిబ్బందితో అక్కడే ఎరువులు కొనుక్కోవాలని తెలపడంతో సహకార సంఘాలలో ఎరువుల అమ్మకాలు పడిపోయాయి. ఇలా సహకార సంఘాలను ఈ ప్రభుత్వం పడుకోబెట్టింది.

చింత తీరలేదు..!

వైసీపీ ప్రభుత్వ హయాంలో చింతలపూడి ఎత్తిపోతల పథకం సర్వనాశనం

ఐదేళ్లుగా పట్టించుకోని ప్రభుత్వం.. పెరిగిన నిర్మాణ వ్యయం

నిర్వాసిత రైతులకు అందని పరిహారం

నూజివీడులో సీఎం జగన్ ఇచ్చిన హామీ నీటిమూటే..

చాట్రాయి, మే 8 : వైసీపీ సర్కార్ అధికారంలోకి వచ్చాక చింతలపూడి ఎత్తిపోతల పథకం సర్వనాశనం అయ్యిందని మళ్ళీ చంద్రబాబు సీఎం అయితేనే పథకానికి మోక్షం కలిగి మెట్ట ప్రాంతం గోదావరి జలాలతో సస్యశ్యామలం అవుతుందని ఆయకట్టు రైతులు అంటున్నారు. మూడున్నరేళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వం చింతలపూడి ఎత్తిపోతల పథకానికి నాబార్డు నుంచి రూ.1,931 కోట్లు రుణం తీసుకుని కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించారు. అయితే రైతులకు పరిహారం చెల్లించక పోవడంతో పనులు ముందుకు సాగలేదు. గత నవంబరులో నూజివీడులో జరిగిన అసైన్డ్ భూముల పట్టాల పంపిణీ సభలో ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు విజ్ఞప్తి మేరకు చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని యుద్ధప్రాతిపదికన ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తామని సీఎం జగన్ హామీ ఇచ్చారు. కానీ పనులేవీ ప్రారంభం కాలేదు. ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాలలో 4.80 లక్షల ఎకరాలకు సాగునీరు, వందల గ్రామాలకు తాగునీరు అందించే పథకం పట్ల జగన్ సర్కార్‌కి ఇంత నిర్లక్ష్యం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

టీడీపీ హయాంలో 70 శాతం పనులు

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 70 శాతం పనులు జరగ్గా, వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పనులు నిలిపివేసి ఐదేళ్ల నిర్లక్ష్యం వహించడం దారుణమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు నష్టపరిహారం ఇస్తే పనులు చేయవచ్చని కాంట్రాక్టర్ ఏడాది పాటు ఎదురు చూసినా ప్రభుత్వంలో కదలిక లేకపోవడంతో పనులు నిలిపివేశారు. నిర్వాసిత రైతులకు ఇవ్వాల్సిన ఫేజ్-1లో రూ.100 కోట్లు, ఫేజ్-2 రూ.25 కోట్లు మొత్తం రూ.125 కోట్లు నష్టపరిహారాన్ని వైసీపీ ప్రభుత్వం ఇచ్చి పనుల కొనసాగించి ఉంటే ఈ పాటికి పథకం ఉపయోగంలోకి వచ్చేదని నిపుణులు చెబుతున్నారు.



చాట్రాయి మండలం చీపురుగూడెం వద్ద తమ్మిలేరుపై నిర్మించిన అక్విడెక్టు

ఫేజ్-2 పనులు పరుగులు

చింతలపూడి ఎత్తిపోతల పథకం ఫేజ్-2ను టీడీపీ హయాంలో ప్రారంభించి రూ.4,909 కోట్లు (1, 2 ఫేజ్‌లకు కలిపి) కేటాయించారు. ఈ పథకానికి 2017 సెప్టెంబరు 17న అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లా మద్దులపర్వలో శంకుస్థాపన చేశారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం ఫేజ్-1ని 2008లో రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉండగా రూ.1,701 కోట్ల అంచనాలతో శ్రీకారం చుట్టారు. ఫేజ్-1 పథకం కాల్వ చింతలపూడి మండలం ఎర్రగుంటపల్లి వద్ద ముగుస్తుంది. రాష్ట్ర విభజన జరిగి ఎన్నెస్పీ ఎడమ కాల్వ ద్వారా ఆంధ్రా ప్రాంతానికి సాగునీరు వచ్చే అవకాశాలు తగ్గిపోవడంతో టీడీపీ ప్రభుత్వం చింతలపూడి ఎత్తిపోతల పథకం ఫేజ్-2కు రూపకల్పన చేసి పనులు పరుగులెత్తించింది. ఫేజ్-2 నిర్మాణం కోసం చాట్రాయి మండలం చీపురుగూడెం, కోటపాడు, చిన్నంపేట, పోతనపల్లి, బూరుగ్గూడెం, నరసింహారావుపాలెం గ్రామాల్లో 600 ఎకరాలు భూమి సేకరించి రూ.50 కోట్లు నష్టపరిహారం చెల్లించారు. చీపురుగూడెం నుంచి చాట్రాయి వరకు 14.5 కిలోమీటర్లు కాల్వ తవ్వాల్సి ఉండగా 3 కి.మీ మేర తవ్వారు. చాట్రాయి వద్ద నుంచి విస్సన్నపేట మండలం రామచంద్రాపురం ఎన్నెస్పీ 117 హెడ్ రెగ్యులేటర్ వరకు 10 కిమీ దూరం వేంపాడు మేజర్ కాల్వను 600 క్యూసెక్కుల సామర్థ్యం నుంచి 3,000 క్యూసెక్కులకు విస్తరణ పనులు 80 శాతం, చీపురుగూడెం వద్ద తమ్మిలేరుపై నిర్మించిన అక్విడెక్టు 90 శాతం పూర్తి చేశారు.

వైసీపీ రావడంతో దుర్దశ

2019 ఎన్నికల్లో తెలుగుదేశం ఓడిపోవడంతో ఈ పథకానికి దుర్దశ వచ్చింది. పనులు పునః ప్రారంభిస్తారని ఆయకట్టు రైతులు, పరిహారం కోసం నిర్వాసిత రైతులు ఐదేళ్లుగా ఎదురుచూస్తున్నారు. పథకం కోసం సేకరించిన భూములకు బ్యాంకులు, సహకార సంఘాల్లో రుణాలు ఇవ్వడం లేదు. వైద్య అవసరాలకు, పిల్లల పెళ్లిళ్లకు భూములు అమ్ముకుందామన్నా అవకాశం లేదు. ఈ పథకం పూర్తయితే ఏలూరు జిల్లాలో పోలవరం, గోపాలపురం, చింతలపూడి, దెందులూరు, నూజివీడు, ఎన్టీఆర్ జిల్లాలో మైలవరం, తిరువూరు, గన్నవరం, నందిగామ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 4.80 లక్షల ఎకరాల మెట్ట భూములకు గోదావరి జలాలు అందడంతో పాటు, కొన్ని వందల గ్రామాలకు తాగునీటి సమస్య తీరుతుంది. జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యం బాధ్యతారాహిత్యం చింతలపూడి ఎత్తిపోతల పథకానికి శాపంగా మారిందని చెప్పవచ్చు.



చాట్రాయి మండలంలో అసంపూర్తిగా ఉన్న చింతలపూడి-2 కాల్వ

రైతాంగానికి తీరని అన్యాయం



చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు నిలిపివేసి వైసీపీ ప్రభుత్వం రైతాంగానికి తీరని అన్యాయం చేసింది. 70 శాతం పనులు పూర్తయిన పథకాన్ని ఐదేళ్ల పట్టించుకోకుండా శిథిలావస్థకు చేర్చిన తీరు చూస్తే, ఈ ప్రభుత్వానికి రైతుల సంక్షేమం పట్ల చిత్తశుద్ధి లేదని అవగతమవుతోంది. నిర్వాసిత రైతులకు పరిహారం ఇవ్వకపోవడం వల్ల వారి బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. పథకం కోసం సేకరించిన భూములకు బ్యాంకులు పంట రుణాలు ఇవ్వడం లేదు. అవసరాలకు అమ్ముకుందామన్నా అవకాశం లేకుండా పోయింది.

- మంచిన పూర్ణ చంద్రరావు, ఆయకట్టు రైతు, కోటపాడు, చాట్రాయి మండలం



ఏలూరులో తనిఖీలు.. స్వాధీనం చేసుకున్న సారా

విస్తృతంగా తనిఖీలు.. ఎస్ఈబీ దాడులు

ఏలూరు క్రైం, మే 8 : ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ దాసరి మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లజాము వరకూ జిల్లాలోని అన్ని ప్రధాన ప్రాంతాల్లోనూ జాతీయ,రాష్ట్రీయ రహదారులపై తనిఖీలు నిర్వహించారు. లాడ్జీలు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్లలో అనుమానాస్పద వ్యక్తులను పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాల్లో రాత్రివేళ సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు.

50 లీటర్ల సారా స్వాధీనం

ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు జిల్లా ఎస్ఈబీ అదనపు ఎస్పీ సూర్య చంద్రరావు ఆధ్వర్యంలో బుధవారం జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా దాడులు చేశారు జిల్లాలోని చింతలపూడి, భీమడోలు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, పోలవరం, ఏలూరు, కైకలూరు ఎస్ఈబీ పోలీస్ స్టేషన్ అధికారులు, చెక్‌పోస్టు సిబ్బంది ఈ దాడులు నిర్వహించారు. సారా తయారీ, విక్రయదారులపై 4 కేసులు నమోదు చేసి వారి నుంచి 50 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. 2800 లీటర్ల బెల్లపుఊట ధ్వంసం చేసి రెండు కేసులు నమోదు చేశారు. డ్యూటీపెయిడ్ లిక్కర్ కల్గి ఉన్న వారిపై 9 కేసులు నమోదు చేసి 54.3 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 16 కేసులలో 13 మంది వ్యక్తులను అరెస్టు చేశారు.



పెంటపాడులో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న డీఎస్పీ మూర్తి

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు

పెంటపాడు, మే 8: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తాడేపల్లిగూడెం డీఎస్పీ మూర్తి అన్నారు. బుధవారం పెంటపాడు, తాడేపల్లిగూడెం రూరల్ మండలాల్లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, చెక్ పాయింట్‌ల వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల ప్రశాంతంగా జరిగేలా ప్రజలందరూ సహకరించాలని కోరారు. తనిఖీల్లో రూరల్ సీఐ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

హోం మంత్రి రాజకీయ కుట్ర

నల్లజర్లలో టీడీపీ నాయకుడిపై దాడి

మంత్రిపై దాడి చేశారంటూ తిరిగి మాపైనే హత్యాయత్నం కేసు

ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి, జడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి

నల్లజర్ల, మే 8: కూటమి అభ్యర్థులకు వస్తున్న ఆదరణను జీర్ణించుకోలేక పోలీసులను అడ్డుపెట్టుకుని హోం మంత్రి తానేటి వనిత రాజకీయ కుట్రకు పాల్పడిందని నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు, జడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు అన్నారు. మంగళవారం రాత్రి వైసీపీ మూకలు చేసిన దాడిపై బుధవారం బాపిరాజు నివాసం వద్ద వారు విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. 30 మంది పోలీసులు ఉండగా 50 మంది వైసీపీ మూకలు బాపిరాజు ఇంటి వద్ద గొడవ చేసేందుకు ఎలా అనుమతిచ్చారని ప్రశ్నించారు.పోలీసుల వైఫల్యం వల్లే గొడవలు జరిగాయని ఆరోపించారు. తమపై హత్యాయత్నం కేసు నమోదు చేయించడం రాజకీయ కుట్ర అన్నారు.

ఇదీ వివాదం..

మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో వైసీపీ మూకలు నల్లజర్లలో ముళ్లపూడి బాపిరాజు ఇంటి వద్ద బైక్ సైలెన్సర్లు తీసేసి కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. రాత్రి 10 గంటల తరువాత ప్రచారం ముగించాలని ఎందుకు కావాలని సౌండ్ చేస్తున్నారని అక్కడ ఉన్న వారు మందలించగా వారు వెళ్లి మరో 30 మందితో వచ్చి గొడవకు దిగారు. ఈ క్రమంలో ప్రచారం ముగించుకుని ఇంటికి వస్తున్న బాపిరాజు వారిని వారించి వెళ్లిపోవాలని కోరారు. గొడవలు ఎందుకని సర్దిచెప్పేందుకు టీడీపీ నాయకుడు ఆలపాటి రామకృష్ణ మరి కొంతమంది వైసీపీ నాయకుడు వెల్లంకి సుబ్రహ్మణ్యం ఇంటికి వెళ్లి మాట్లాడుతున్న సమయంలో కురిపితో రామకృష్ణ తలపై బలంగా కొట్టారు. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయాన్ని ముళ్లపూడి బాపిరాజు, మద్దిపాటి వెంకట్రాజుకు చెప్పడంతో వెంటనే సుబ్రహ్మణ్యం ఇంటికి వెళ్లారు. కోపంతో బాపిరాజు అనుచరులు అక్కడున్న కుర్చీలు విసిరేశారు. అయితే ఈ సమయంలో హోం మంత్రి అసలు నల్ల జర్లలో లేకపోయిప్పటికీ తనపై దాడి చేయడానికి వచ్చారని సెక్షన్ 307 పెట్టించినట్టు బాపిరాజు పేర్కొన్నారు. హోం మంత్రి, పోలీసులు ఎన్ని కేసులు పెట్టినా తాము భయపడబోమని ప్రజల్లో తెల్చుకుంటామని చెప్పారు. జనసేన కన్వీనర్ సువర్ణరాజు, పసుమర్తి రతీష్, యద్దనపూడి బ్రహ్మారాజు, ఆంద్రు అనిల్, తాతిన సత్యనారాయణ పాల్గొన్నారు.





బాపిరాజు ఇంటి వద్ద వైసీపీ,టీడీపీ శ్రేణుల వాగ్వాదం

తలకు గాయంతో ఆలపాటి రామకృష్ణ



విలేకరులతో మాట్లాడుతున్న బాపిరాజు, వెంకట్రాజు



రహదారిపై నిరసనలా ?

అనుమతి ఉందా లేదా ? తేల్చని అధికారులు

ద్వారకాతిరుమల, మే 8: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో ద్వారకాతిరుమల ప్రధాన రహదారి పక్కనే టెంట్లు వేసి వైసీపీ నాయకులు నిరసన చేపట్టడం విమర్శలకు దారి తీసింది. నల్లజర్లలో తానేటి వనితపై మంగళవారం రాత్రి టీడీపీ వారు దాడి చేశారని దానికి నిరసనగా వైసీపీ నాయకులు నిత్యం రద్దీగా ఉండే గరుడాళ్వార్ సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. ఇందులో రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత కూడా పాల్గొనడంతో రహదారి వాహనాలు, జనాలతో రద్దీగా మారింది. రోడ్డుపై డివైడర్‌కు ఒక పక్క టెంట్లు వేసి కూర్చోగా మరోపక్క రాకపోకలకు అంతరాయం కల్గించేలా నేతల వాహనాలను నిలిపారు. దీంతో పలువురు ఇబ్బందులు పడ్డారు. దీనికి ఎన్నికల అధికారుల నుంచి అనుమతి ఉందా ? రోడ్లపై ఈ నిరసనలు ఏమిటంటూ గ్రామస్థులు, భక్తులు మండిపడ్డారు. దీనిపై వివరణ కోరేందుకు ప్రయత్నించగా అధికారులు అందుబాటులోకి రాలేదు.

'దళిత ద్రోహి జగన్'

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 8: దళిత ద్రోహి జగన్‌ను గద్దె దింపాల్సిందేనని మాలమహాసేన సంఘాల జేఏసీ పిలుపునిచ్చింది. మహిళల క్లబ్‌లో మాలమహాసేన జాతీయ అధ్యక్షుడు అలగ రవికుమార్ ఆధ్వర్యంలో బుధవారం దళితుల రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాలమహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు మాట్లాడుతూ జగన్ గద్దెనెక్కిన తరువాత 27 దళిత సంక్షేమ పథకాలను రద్దు చేశాడన్నారు. మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను పక్కదోవ పట్టించటమే కాకుండా పేదల పక్షపాతినని చెప్పుకుంటున్న జగన్ ఒక గుంట నక్క అని అన్నారు. మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చారువాక మాట్లాడుతూ దళితులను ఉన్నత విద్యకు దూరం చేసిన జగన్‌ను గద్దె దింపాలన్నారు. మెడికల్ సీట్లు అమ్ముకుని దళితులకు తీరని ద్రోహం చేశాడన్నారు. కె.రవికుమార్, నానిబాబు, విజయ్, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

పేదల పాలిట పెన్నిధి ఫాదర్ అహరోను

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 8: పేదల పాలిట పెన్నిధి ఫాదర్ అహరోను అని ఏలూరు కథోలిక పీఠాధిపతులు మోస్ట్ రెవరెండ్ బిషప్ జయరావు పొలిమేర అన్నారు. బుధవారం ఫాదర్ అహరోను గురుపట్టాభిషేకం జరిగి నలభై ఏళ్లు పూర్తయిన సందర్భంగా మైకేల్ చర్చిలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఫాదర్ బాల, ఫాదర్ మోజెజ్, ఫాదర్ మైకేల్, ఫాదర్ చైతన్య, సిస్టర్లు, మత పెద్దలు పాల్గొన్నారు.



అహరోను ఫాదర్‌ను సత్కరిస్తున్న బిషప్ జయరావు పొలిమేర

ఈసెట్‌కు 24 మంది గైర్హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, మే 8 : పాలిటెక్నిక్ పూర్తిచేసిన విద్యార్థులు నేరుగా ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరంలోకి ప్రవేశించేందుకు నిర్వహించే 'ఈసెట్' పరీక్ష బుధవారం జిల్లా మొత్తానికి ఏలూరులోని మూడు కేంద్రాల్లో ప్రశాంతంగా ముగిసింది. రెండు సెషన్లలో జరిగిన ఈ ఆన్‌లైన్ పరీక్షకు ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ పరీక్ష కేంద్రంలో ఉదయం, మధ్యాహ్నం సెషన్లకు 94మంది చొప్పున, సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల పరీక్షకేంద్రంలో ఉదయం 120, మధ్యాహ్నం 89మంది, సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాల పరీక్షకేంద్రంలో ఉదయం 173, మధ్యాహ్నం 137మంది విద్యార్థులు హాజరయ్యారని ఈసీఈ ప్రతినిధి రవికిరణ్ తెలిపారు. మొత్తం 24మంది గైర్హాజరయ్యారని వివరించారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

ఏలూరు క్రైం, మే 8 : క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత చదువులు చదువుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్ ఆదేశాల మేరకు బుధవారం ఏలూరు సమీపంలోని శనివారపుపేటలో ఉన్న ప్రభుత్వ బాలుర వసతిగృహాన్ని ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తీర్ణులై అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరిశుభ్రత పాటించాలని, క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దబడతారన్నారు. విద్యార్థి దశలోనే కష్టపడి చదువుకుంటేనే జీవిత కాలం సుఖసంతోషాలతో జీవించవచ్చని సూచించారు. కార్యక్రమంలో వసతి గృహ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'జీవ వైవిధ్యాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత'

పెదపాడు, మే 8 : జీవ వైవిధ్యాన్ని కాపాడడం ప్రతిఒక్కరి బాధ్యత అని, దీనిలో విద్యార్థులు భాగస్వాములు కావాలని కళాశాల జువాలజీ హెచ్‌వోడీ డాక్టరు స్వప్న తెలిపారు. సర్ సీఆర్ రెడ్డి మహిళా కళాశాల తరపున 9వ వార్షిక సిటీ నేచుర్ ఛాలెంజ్ - 2024 లింక్‌లో ఆర్గనైజర్‌గా నమోదైన స్వప్న, ఆమె పర్యవేక్షణలో కళాశాల 167 మంది విద్యార్థులు అంతరించిపోతున్న జీవ జాతులపై చుట్టుపక్కల ప్రదేశాలల్లో ఫొటోలు తీసి పోటీకి అప్‌లోడ్ చేశారు. ఈ పోటీకి రాష్ట్రవ్యాప్తంగా 10,968 ఫొటోలు అప్‌లోడ్ కాగా ఇందులో 8,828 ఫొటోలు ఒక్క ఏలూరు జిల్లా నుంచి అప్‌లోడ్ కాగా, రాష్ట్ర స్థాయిలో జిల్లాకు 4వ ర్యాంకు, జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్‌కు 6వ ర్యాంకు, ఇంటర్నేషనల్ స్థాయిలో ఇండియాకు 72వ ర్యాంకు లభించినట్లుగా హెచ్‌వోడీ డాక్టరు స్వప్న తెలిపారు.

విశ్వబ్రాహ్మణులతో టీడీపీ ఆత్మీయ సమావేశం

కామవరపుకోట, మే 8 : ఆడమిల్లి గ్రామంలో కంచికామాక్షి ఆలయం వద్ద బుధవారం మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ ఆగ్రామంలోని విశ్వ బ్రాహ్మణ సంఘ ప్రతినిధులతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల ప్రయోజనాలను వివరించారు. అనంతరం వి శ్వబ్రాహ్మణులంతా టీడీపీకి మద్దతు ప్రకటించారు. సర్పంచ్ గూడపాటి కేశవరావు, బీసీ సెల్ అధ్యక్షులు జుజ్జూరి బాబ్జి, టీడీపీ నాయకులు మద్దిపాటి శ్రీను, యలమర్తి రాంబాబు, విశ్వబ్రాహ్మణ సంఘనాయకులు పారేపల్లి రామబ్రహ్మం, సత్యనారాయణ, పుల్లాచారి, కనసాని శ్రీనివాసరావు, రాధాకృష్ణ, గణపవరపు శ్రీను, చేకుర్తి బ్రహ్మం, కొక్కొండ రాంబాబు, పాపాచారి పాల్గొన్నారు.

కూటమికి ఆటో డ్రైవర్ల సంపూర్ణ మద్దతు

కామవరపుకోట, మే 8:తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు బుధవారం కామవరపుకోటలోని ఒకతోటలో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. కూటమి నాయకులు కోనేరు వెంకటసుబ్బారావు, ఘంటా సుధీర్‌బాబు, నెక్కలపు సూర్యనారాయణ, నూతి రాటాలు, బొబ్బిలి డాన్ దివాకర్, పండు జగదీష్, నెక్కలపు గంగాధరరావు బృందం బుధవారం స్థానిక కొబ్బరి తోట వద్ద పలు సంఘాల ఆటో యూనియన్లతో సుదీర్ఘ చర్చలు జరిపారు. కూటమి నేతలు ప్రయోజనాలను వివరించారు. సూపర్ సిక్స్ పథకాల బ్రోచర్లు అందించారు. అనంతరం ఆటో యూనియన్లు కొద్దిసేపు చర్చించుకుని కూటమికు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

కూటమి అభ్యర్థుల గెలుపునకు విస్తృత ప్రచారం

కుక్కునూరు, మే 8 : కుక్కునూరు మండలంలో ఎంపీ, అసెంబ్లీ కూటమి అభ్యరుథల విజయం కోసం టీడీపీ, జనసేన, బీజేపీ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. గుంపెనపల్లి గ్రామంలో వల్లె సీతారాములు, వేముల చంద్రరావు ఆధ్వర్యంలో 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ముత్యాలంపాడు, ఉప్పరమద్దిగట్ల గ్రామాల నుంచి మరో 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి. టీడీపీ మండల అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు, కోటగిరి సత్యనారాయణ, పిచుక రాజు, రాంబాబు, బాబూరావు, తాళ్లూరి సురేష్, పులి శ్రీను, ముప్పాల శివయ్య, కేవీఆర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీయే గెలుపు పేదవర్గాల గెలుపు

టి.నరసాపురం, మే 8, ఆంధ్రజ్యోతి: ఎన్డీయే అభ్యర్థుల గెలుపు పేదవర్గాల గెలుపు అని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు విస్సంపల్లి సిద్ధూ మాదిగ తెలిపారు. మండలంలోని మక్కినవారిగూడెం, బండివారిగూడెం అప్పలరాజు గూడెం గ్రామాల్లోని సూర్యనగర్, ఇందిరా కాలనీలో ఎన్డీయే కూటమి అభ్యర్థులను గెలిపించాలని బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం తెలుగు యువత పోలవరం నియోజకవర్గం అధ్యక్షుడు గన్నెన సురేంద్రనాథ్ చౌదరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల సంక్షేమాన్ని విస్మరించిన జగన్‌మోహన్‌రెడ్డికి ఎన్నికల్లో పరాభవం తప్పదన్నారు. టి.శ్రీనివాసరావు, బాషా, నాని, పాతూరి సత్యనారాయణ, తమ్మిన రాంబాబు, పాతూరి రామకృష్ణ, రత్నకుమార్, ఎల్లిన జగన్, వాసు చౌదరి, రమేష్ మాదిగ, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థి పుట్టాకు యాదవ్, గౌడ్ సంఘం నేతల మద్దతు

దెందులూరు, మే 8 : ఏలూరు ఎంపీ పరిధిలోని ఓటర్లు, ప్రజలు చూపిస్తున్న ప్రేమ అప్యాయత మరిచిపోలేనని విద్య, వైద్యం, అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని యాదవ్ సంఘ నేతలతో టీడీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ అన్నారు. బుధవారం చల్లచింతలపూడికి చెందిన యాదవ్ సంఘం నేత ముమ్మడి మోహన్‌రావు, దెందులూరు మాజీ వైస్ ఎంపీపీ నాగనబోయిన సత్యనారాయణ, గౌడ సంఘం నేతలు వేమన రాముగౌడ్, మొదుగుమూడి రాంబాబు, వేమన సుధాకర్ తదితరులు ఆయయను మద్దతు ప్రకటించి మాట్లాడారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించుకుంటామన్నారు.

ఎన్డీఏ కూటమికి ఎమ్మార్పీఎస్ మద్దతు

పెదపాడు, మే 8 : సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి మద్దతుగా పునుకొల్లు గ్రామంలో జనసేన కార్యకర్తల ర్యాలీలో ఎమ్మార్పీఎస్ నేతలు బుధవారం పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో జగన్ రాక్షస పాలనకు స్వస్తి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ఎన్డీయే కూట మి అధికారంలోకి వస్తుందన్నారు. అనంతరం గోగుం ట, రాజుపేట గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్, దెందులూరు కూట మి అభ్యర్థి చింతమనేని ప్రభాకర్‌లను గెలిపించాలని విస్తృత ప్రచారం నిర్వహించారు. ఎర్ర నాగమల్లేశ్వ రరావు, కొల్లూరు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ క్రైం పోలీసుల పేరుతో మోసం

ఓ స్టాఫ్‌నర్స్ నుంచి రూ.53 వేలు ఖాతాకు ట్రాన్స్‌ఫర్

ఏలూరు క్రైం, మే 8:సైబర్ క్రైం పోలీసులమని మిమ్మల్ని అరెస్ట్ చేసేందుకు వస్తున్నామని స్టాఫ్‌నర్స్‌ను ఫోన్‌లో బెదిరించి ఆగంతకులు ఆమె వద్ద నుంచి రూ.53 వేలు నగదు కాజేశారు. పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాలివి.. సత్రంపాడులో నివాసముం టున్న వన్నెకూటి పావని పెదపాడు మండలం వట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్‌నర్స్‌గా పనిచేస్తున్నారు. బుధవారం ఆమెకు ఓ అపరిచిత వ్యక్తి ముంబై నుంచి ఫోన్ చేస్తున్నామని, సైబర్ క్రైం పోలీసులమని మీపై 24 కేసులు ఉన్నాయని అరెస్టు చేసేందుకు వస్తున్నామని బెదిరించారు. అరెస్ట్ చేయకుండా ఉండాలంటే డబ్బు ఇవ్వాలని లేదంటే ఏడేళ్ల శిక్ష పడుతుందని బెదిరించారు. ఓ బ్యాంక్ ఖాతా నంబరు మెస్సేజ్ చేశారు. బెదిరిపోయిన ఆమె వారు పంపించిన ఖాతాకు రూ.53వేలు ట్రాన్స్‌ఫర్ చేశారు. ఆ తరువాత ఈ విషయాన్ని తన సహచరులకు చెప్పగా నకిలీ పోలీసులు అని, మోసపోయామని నిర్ధారించడంతో బాధితురాలు ఏలూరు వన్‌టౌన్ పోలీసు స్టేషన్ వద్ద ఉన్న సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా స్పందించిన పోలీసులు ఆమె డబ్బు పంపించిన ఖాతాను హోల్డ్ చేయించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అంతా ఒక్కటై.. మహేష్‌తో ఏకమై

- ఇది మహేష్ మార్క్ మేనిఫెస్టో
- ఏలూరు ఎంపీ స్థానంలో కొత్తదనం
- బీసీ, ఇతర వర్గాలను కూడగట్టడంలో సక్సెస్
- ప్రచారంలో ముందు వరుసలోనే బిగ్ ఫైట్



(ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

ఎన్నికల సమర రంగంలో అంతా మునిగి తేలుతున్నారు. ప్రచారం వేడెక్కింది. సవాళ్లు, ప్రతిసవాళ్లతో వేడెక్కింది. అంతకంటే మించి 2019 ఎన్నికల్లో ఉన్న నాటి వైసీపీ అనుకూల ధోరణి అంతా సన్నగిల్లింది. ఆనాడు ఫ్యాను గాలి వైపు మళ్లినవారిలో అనేక వర్గాలు ఇప్పుడు మనస్సు మార్చుకున్నట్లే కన్పిస్తోంది. ప్రచార సరళిలో కూటమి, వైసీపీ నేపథ్యం చూసినప్పుడు ఈ ధోరణి పక్కాగా బయట పడుతోంది. ప్రత్యేకించి అధికార పార్టీ నుంచి వలసలు, కూటమి వైపు భారీగా ఉండటం ఈసారి ఇంకో పరిణామం. మేనిఫెస్టోలోనే వైసీపీ, కూటమి మధ్య వ్యత్యాసం బయట పడడం, అప్పటినుంచి కూటమి కదలికలు వేగంగానూ, గ్రామాల్లో ఫ్యాన్ తిరగడం క్రమేపీ క్షీణిస్తున్న వైనం కూడా రాజకీయ వర్గాలను తికమకపెడుతోంది. ఎన్నికలు వచ్చి పడుతున్నాయి కాబట్టి అధికార వైసీపీ బీసీ నినాదం అందుకుంది. ఆ పక్షానే తామున్నట్లు, ఆ వర్గమంతా తమవైపే చూస్తున్నట్లు బిల్డప్ ఇస్తుంది. నియోజకవర్గంలో ఈ అంశంపైనే సభలు, సమావేశాలు జోరుగా నిర్వహించాయి. ఆత్మీయ సమ్మేళనాలకు, వాటికి హాజరవుతున్న వారి సంఖ్య రికార్డు స్థాయిలోనే ఉంది. అయితే బీసీలకు సంబంధించి ఈ ఐదేళ్లలో బీసీలకు చేసిన అభివృద్ధి ఏదంటూ కూటమి బహిరంగంగా నిలదీస్తుండడంతో ఆ పార్టీ గణాంకాలు కూడా తెలియజేయ లేకపోయింది. ఏలూరు లోక్‌సభ స్థానంలో ఇటు టీడీపీ తరపున పుట్టా మహేష్‌కుమార్ యాదవ్, వైసీపీ పక్షాన కారుమూరి సునీల్‌కుమార్ పోటీ పడుతున్నారు. ఏలూరు లోక్‌సభ చరిత్రలో ప్రధాన పక్షాల నడుమ బీసీ యుద్ధం జరగడం ఇదే ప్రథమం. దెందులూరు, కైకలూరు, ఉంగుటూరు, ఏలూరులో కూడా బీసీ ఓటర్ల సంఖ్య గణనీయంగా ఉంది. తెలుగుదేశం పార్టీ పక్షాన అగ్రవర్ణాలకు చెందిన ఆశావహు లందరూ ఎంపీ టిక్కెట్ మీద ఆశలు పెట్టుకున్నా కూడా అందరిని కాదని బీసీ అభ్యర్థికే ఏలూరు ఎంపీ సీటు అంటూ తెలుగుదేశం మొదట్లోనే ఒక నిర్ణయానికి వచ్చి ఆ దిశగానే యువకుడైన పుట్టా మహేష్‌ను రంగంలోకి దింపింది. ఆఖరికి బీజేపీ ఏలూరు సీటు కోసం మంకు పట్టు పట్టినా కూటమిలో ప్రధాన భాగస్వామి పార్టీ అయిన టీడీపీ దీనిని అలవోకగా తోచి పుచ్చింది. వైసీపీ సైతం మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తనయుడు కారుమూరి సునీల్‌కుమార్‌ను అభ్యర్థిగా రంగంలోకి దింపింది. ఇప్పుడు వీరి మధ్యే పోటీ అనూహ్యంగా మారింది. పోటీ ఎవరి పైచేయి అన్నట్లుగా సాగుతోంది.

ఇది మహేష్ మేనిఫెస్టో..

రాజకీయపార్టీలు ఎన్నికల్లో ఓటర్లకు తాము ఏమీ చేయబోతున్నామో ఒక నిర్దిష్ట హామీ పత్రాన్ని ముందుగానే ప్రకటిస్తారు. తదనుగుణంగానే వీటి అమలుకు జాగ్రత్త పడతాయి. అన్నివర్గాల సంక్షేమాన్ని దృష్టిలో వుంచుకుని కీలక అంశాలను ప్రస్తావిస్తాయి. కానీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మహేష్ యాదవ్ మాత్రం ఉమ్మడి కూటమి మేనిఫెస్టోతో పాటు తన మదిలో వున్న హామీలన్నింటినీ నియోజకవర్గాల వారీగా విడమర్చి చెబుతూనే ఉన్నారు. తానేమీ చేయదల్చుకున్నానో స్పష్టంగా మీకు చెబుతున్నా. మీ మద్దతు, బలం మాకు ముఖ్యం. ఆ దిశగానే నేను ఢిల్లీకి మీ ప్రతినిధిగా వెళ్లేలా ఆశీర్వదించమంటూ పదే పదే ఓటర్లకు విజ్ఞప్తి చేస్తూ వచ్చారు.

మేనిఫెస్టో వివరాలు ఇలా..

పోలవరం పూర్తి చేయడం, వేలాది ఎకరాలకు సాగునీరు అందించే చింతలపూడి ఎత్తిపోతలను దగ్గరుండి పూర్తి చేయించడం, కొల్లేరు వాసులు ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా వేగంగా నిర్ణయాలు, ఏలూరు నగరాన్ని స్మార్ట్ సిటీగా రూపుదిద్దడం, నగరంలో మౌలిక సదుపాయాల కల్పన మరింత వేగవంతం. నిరుద్యోగ యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఏలూరుతో సహా మిగతా నియోజకవర్గాల్లోనూ సరికొత్త పరిశ్రమలను రప్పించడం, పారిశ్రామికీకరణకు ఔత్సాహికులను ప్రోత్సహించడం, నూజివీడులో ప్రసిద్ధి చెందిన మ్యాంగో అభివృద్ధికి తక్షణ చర్యలుపై ఇప్పటికే భరోసా ఇచ్చారు. చింతలపూడిలో రోడ్లు వేయడం, మౌలిక సదుపాయాల కల్పన, గురుకుల పాఠశాల నిర్మాణం, వంద పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేయడం, పోలవరం ముంపు ప్రాంతాలైన కుక్కునూరు, వేలేరుపాడులో పెట్రోలు బంకు ఏర్పాటు, రోడ్లు, రవాణా విస్తరణ, పోలవరం నిర్వాసిత కుటుంబాల ప్యాకేజీ కోసం ప్రత్యేక రక్షణ నిధికి ఇప్పటికే కోటి ఇచ్చి ఆపై అండగా ఉండడం, మారుమూల గ్రామాల అభివృద్ధి, ఏలూరులో వందే భారత్ రైలు నిలుపుదల చేసేలా చర్యలు, బీసీ వర్గాల సంక్షేమంతో పాటు మిగతా వర్గాలకు అండా ఉంటానని హామీలు ఇప్పటికే ప్రజలకు ఇచ్చారు. దీంతో అన్నీవర్గాలోనూ పుట్టా మహేష్‌పై ఒక నమ్మకం వచ్చింది.

వైసీపీ రాక్షస పాలనకు చరమగీతం పాడాలి

- ఏలూరు కూటమి అభ్యర్థి బడేటి చంటి

ఏలూరుటూటౌన్, మే 8: వైసీపీ రాక్షస పాలనకు చరమగీతం పాడేందుకు రోజులు దగ్గరపడ్డాయని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఏలూరు నియోజకవర్గ అభ్యర్థి బడేటి రాధాకృష్ణయ్య (చంటి) అన్నారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా 12వ డివిజన్‌లో చంటి ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చంటికి అపూర్వ స్వాగతం పలికారు. ప్రతీ ఇంటి వద్ద కూటమి ప్రభుత్వం ఎప్పుడు వస్తుందని ప్రశ్నిస్తున్నారన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. గత ఐదేళ్ళుగా వైసీపీ ప్రజలను ఏవిధంగా ఇబ్బంది పెట్టిందో ప్రజలు వివరించారని అన్నారు. త్వరలో టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడబోతుందని, ఈ ఐదేళ్ల కష్టాలకు ఉపశమనం అందజేస్తామని హామీ ఇచ్చారు. కూటమి మేనిఫెస్టో పట్ల ప్రజల్లో సంతోషాలు వ్యక్తమవుతున్నా యన్నారు. పింఛన్ ఏప్రిల్ నుంచే రూ.4వేలు, మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఆర్‌టీసీ బస్సు ప్రయాణం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. గాది రాంబాబు, కుసుమకుమారి, ఎంఆర్‌డీ బలరామ్, మనోజ్, చోడే వెంకటరత్నం, తవ్వా అరుణకుమారి, తదితరుల పాల్గొన్నారు.



ఏలూరు 12వ డివిజన్‌లో బడేటి చంటి ప్రచారం

చింతలపూడి ఎత్తిపోతలను పూర్తి చేస్తా

- చింతలపూడి కూటమి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్

లింగపాలెం, మే 8: పోలవరం ప్రాజెక్టుతోపాటు, చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తిచేసి నియోజ కవర్గంతో పాటు ఎత్తిపోతల పథకం కింద రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని కూటమి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్ అన్నారు. మండలంలోని కొణిజర్ల, కలరాయనిగూడెం, లింగపాలెం, మఠంగూడెం గ్రామాల్లో వారు బుధవారం ప్రచారం నిర్వహించారు. లింగపాలెంలోని సారమ్మతల్లి పేరంటాలు, సాయిబాబా గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మఠంగూడెంలో సొంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో సుపరిపాలన టీడీపీతోనే సాధ్యమన్నారు. టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలు పేదలకు ఎంతో మేలు చేస్తాయన్నారు. జగన్ ప్రభుత్వంలో పేదలకు సంక్షేమ పథకాలు ఇస్తున్నామంటూ వారిని మోసం చేశాడని, ప్రతిఒక్కర్ని ఇబ్బందులకు గురిచేస్తూ రాక్షస ఆనందం పొందుతున్నాడని విమర్శించారు. టీడీపీ కార్యకర్తలపై దాడులు చేయడం నిత్యకృత్యంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ మాట్లాడుతూ చింతలపూడి ఎత్తిపోతల పథకం ద్వారా నియోజకవర్గానికి ఎంతో మేలు జరుగుతుం దన్నారు. సభ అనంతరం పిడుగుపాటుకు గురై చనిపోయిన టీడీపీ కార్యకర్త పరసా రామారావు కుటుంబసభ్యులను పరామర్శించి, ఆ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గరిమెళ్ళ చలపతిరావు, మోరంపూడి మల్లికార్జునరావు, ముసునూరి రాము, గారపాటి బుజ్జియ్య, చిలకబత్తుల బుచ్చయ్య, ప్రభాకర్, పూర్ణ, సాంబశివరావు, వలసపల్లి శ్రీను, సాంబయ్య, పిల్లల శ్రీనివాసయాదవ్, చెన్ను శ్రీనివాసయాదవ్, ఆసిలేటి అజయ్, గుత్తా సత్యసాయివరప్రసాద్, రాయంకుల చక్రధరరావు తదితరులు పాల్గొన్నారు.



లింగపాలెం మండలంలో సొంగా రోషన్‌కుమార్ ప్రచారం

అన్నివర్గాల ప్రజల అభివృద్ధే ధ్యేయం

- దెందులూరు కూటమి అభ్యర్థి చింతమనేని

ఏలూరు రూరల్/పెదవేగి/పెదపాడు, మే 8: అన్నివర్గాల ప్రజల అభివృద్ధే ధ్యేయంగా, ప్రజాసమస్యల పరిష్కారం దిశగా కృషిచేస్తానని దెందులూరు ఎమ్మెల్యే కూటమి అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ అన్నారు. బుధవారం టీడీపీ శ్రేణులు, అభిమానుల మధ్య ఏలూరు రూరల్ దొండపాడు, పెదవేగి మండలం రాట్నాలకుంట, ముండూరు గ్రామాల్లో ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైకిల్‌గుర్తుపై ఓటువేసి అత్యంత మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. జగన్ పాలనకు కౌంట్‌డౌన్ ప్రారంభమైందని, ప్రజలు ఓటు అనే ఆయుధంతో గద్దెదించటానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఒక్క ఛాన్స్ పేరుతో రాష్ట్రంలోని అన్నివర్గాలను జగన్ మోసం చేశాడని, యువతకు భవిష్యత్ లేకుండా చేశాడని, గంజాయి మత్తుకు బానిసలు అయ్యేలా చేశాడని మండిపడ్డారు. ఈ ఐదేళ్లలో అభివృద్ధి కరువైందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వాకా అన్నవరం, వీరంరెడ్డి రమేష్‌నాయుడు, వి.సాంబయ్య జాగర్లమూడి బాలకృష్ణ, యర్రా జగదీశ్వరరావు, జనసేన నాయకులు లోవరాజు, కె.అశోక్, మాగంటి రమేష్, భానుప్రసాద్, నెక్కంటి ప్రసాద్, ఎం.నాగరాజు, సుధ, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

● టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితోనే రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం సాధ్యమని టీడీపీ కూటమి అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ కుమార్తె చింతమనేని నవ్య పెదవపాడు మండలం వట్లూరు, వసంతవాడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పెదవేగి మండలం కూచింపూడిలో చింతమనేని ప్రభాకర్ సతీమణి రాధారాణి ప్రచారం చేశారు.



దొండపాడులో ప్రచారం చేస్తున్న చింతమనేని (ఇన్‌సెట్‌లో) వట్లూరులో నవ్య ప్రచారం

నేటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

ఏలూరు కార్పొరేషన్, మే 8 : దేవదాయశాఖ ఆధ్వర్యంలో రామచంద్రరావుపేటలోని వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఈనెల 9 నుంచి 14వ తేదీ వరకు స్వామివారి వైశాఖ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ తోలేటి శ్రీనివాస్, ఆలయ ఈవో నాగం సన్యాసిరావు తెలిపారు. ఆరు రోజుల పాటు ఉదయం, సాయంత్రం వేళల్లో అభిషేకాలు, అర్చనలు, హోమాలు, ప్రత్యేక అలంకరణలు స్వామికి జరుపుతామన్నారు. గురువారం అశ్వవాహనంపై శ్రీవారిని, అమ్మవార్లను పెండ్లి కుమారునిగాను, పెండ్లి కుమార్తెలుగా అలంకార పూజలు జరుపుతామన్నారు. 10న గరుడ ధ్వజారోహణ, 11న సంతాన గోపాలేష్టి, శ్రీవారి తిరు కల్యాణం, 12న తిరుమంజనసేవ, 13న శ్రీహయగ్రీవేష్టి, 14న మహాపూర్ణాహుతి, చక్ర స్నానం, ద్వాదశ ప్రదక్షిణలు, శ్రీపుష్పయాగం, శయనోత్సవంతో వైశాఖ బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వారు తెలిపారు.

చంద్రబాబుకు దివ్యాంగులు రుణపడి ఉంటారు

గణపవరం, మే 8: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే దివ్యాంగులకు పింఛన్ రూ.6వేలు ఇస్తామని. ఉమ్మడి మేనిఫెస్టోలో దివ్యాంగులకు హామీ ఇచ్చారని వికలాంగుల మహాసంఘటన్ జిల్లా కార్యదర్శి క్రొవ్విడి ఉదయ శంకర్ తెలిపారు. దివ్యాంగు లందరూ చంద్రబాబుకు, కూటమి నేతలకు రుణప డి ఉంటాం. తాము వికలాంగులకు ఉచితంగా కృత్రి మ అవయవాలు తయారు చేసి అందిస్తుంటామ న్నారు. ది వ్యాంగులకు వైసీపీ ప్రభుత్వం ఎటువంటి ప్రాధాన్యత ఇవ్వలేదు. సంక్షేమంలో కూడా దివ్యాంగులకు దగా జరిగింది. ప్రస్తుతం పింఛన్ రూ.3వేలు ఇస్తున్నారు. కూటమి ప్రభుత్వం రాగానే పింఛన్ రూ.6వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. తప్పకుండా హామీ నెరవేరుస్తారని ఆశతో ఉన్నామన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

- ఉంగుటూరు కూటమి అభ్యర్థి పత్సమట్ల

నిడమర్రు/భీమడోలు, మే 8 : అభివృద్ధితో కూడిన సంక్షేమమే ధ్యేయమని ఉంగుటూరు కూటమి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. బుధవారం నిడమర్రు మండలంలో గుణపర్రు, ఛానమిల్లి, బావాయిపాలెం, సిద్ధాపురం, భువనపల్లి, పెదనింద్రకొలను, తోకలపల్లి, ఆముదాలపల్లి, బైనేపల్లి గ్రామాల్లో కార్యకర్తలతో కలసి భారీగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆయన మట్లాడు తూ ఉంగుటూరు నియోజకర్గ అసెంబ్లీ ఎన్నికలలో నాలుగో నంబరులో పత్సమట్ల ధర్మరాజు గాజు గ్లాసు గుర్తుకు, ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యా దవ్‌కు నాలుగో నంబరులో గల సైకిలు గుర్తుకు ఓటు వేయాలన్నారు. భీమడోలు మండలం పూళ్ళ గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నేతలతో పాటు కోడూరుపాడుకు చెందిన వైసీపీ నేతలు రామినేని సురేష్‌బాబు, తాళ్ళూరి శ్రీనివాస్, రవి తదితరులు జనసేనలో చేఆరు. వారికి జనసేన కూటమి అభ్యర్థి ధర్మరాజు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.



నిడమర్రు మండలంలో పత్సమట్ల ధర్మరాజు ర్యాలీ

స్వర్ణకారుల సమస్యలు పరిష్కరిస్తాం

గణపవరం, మే 8: స్వర్ణకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు జనసేన కూటమి ప్రభుత్వం అంకితభావంతో కృషి చేస్తుందని జనసేన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు సోదరుడు భీమరాజు భరోసా ఇచ్చారు. బుధవారం గణపవరంలో జరిగిన సమావేశంలో విశ్వబ్రహ్మణ సంఘం, స్వర్ణకార సంఘం సభ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు, మాజీ సర్పంచ్ వేముల బాలశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి విజయం ఖాయం

- పోలవరం కూటమి అభ్యర్థి చిర్రి, టీడీపీ కన్వీనర్ బొరగం

బుట్టాయగూడెం/జీలుగుమిల్లి/కొయ్యలగూడెం/పోలవరం, మే 8 : సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయం ఖాయమని పోలవరం నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ బొరగం శ్రీనివాస్, పోలవరం కూటమి అభ్యర్థి చిర్రి బాలరాజు తెలిపారు. బుధవారం బుట్టాయగూడెం మండలం లక్ష్మదుగూడెం పంచాయతీలోని కొమ్ముగూడెం ఇతర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీ కూటమి అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ ఎన్నికల గుర్తు సైకిల్, పోలవరం అసెంబ్లీ అభ్యర్థి చిర్రి బాలరాజు ఎన్నికల గుర్తు గాజుగ్లాసుపై ఓట్లు వేసి మెజార్టీతో గెలిపించాలని కోరారు. నియోజకవర్గ పరిశీలకుడు అనపర్తి వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు. జీలుగుమిల్లి మండలంలోని పి.రాజవరం, జీలుగుమిల్లి, తాటియాకులగూడెం, కామయ్యపాలెం, అంకంపాలెం, రౌతుగూడెం, ములగలంపల్లి గ్రామాల్లో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ప్రచారం నిర్వహిస్తూ కూటమి మేనిఫెస్టోను వివరించారు. టీడీపీ అధ్యక్షులు సుంకవల్లి సాయి, జనసేన అధ్యక్షులు పసుపులేటి రాము, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శులు గడ్డమణుగు రవికుమార్ పాల్గొన్నారు. కొయ్యలగూడెం మండలం అంకాలగూడెంలో పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థి చిర్రి బాలరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు ఆధ్వర్యంలో వంద మంది కార్యకర్తలు, నాయకులు జనసేన, టీడీపీలో చేరారు. జనసేన నాయకులు దుగ్గిన శ్రీను, మురళీ, చోడిపిండి సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు ముప్పనాపల్లి వెంకటేశ్వరరావు, నక్కా రవి, గడ్డియ్య పాల్గొన్నారు. పోలవరం మండలంలో టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ మంగిన కొండ, ఎస్సీ సెల్ నాయకులు తాడేపల్లి మలాకీ, పిల్లి నాగరాజు ఆధ్వర్యంలో బెస్తావీధి, కమ్మరగూడెం, వడ్డీలపేటలలో ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. పలువురు జనసేన పార్టీలో చేరారు.



కొమ్ముగూడెంలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న బొరగం శ్రీనివాస్, చిర్రి బాలరాజు

పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలి

ఏలూరు రూరల్, మే 8: ఎన్నికల్లో పోలింగ్ బూత్‌ల వద్ద షామియానా, కుర్చీలు, మంచినీరు, భోజనం, ఇతర సదుపాయాల ఏర్పాట్లు చేయాలని అధికారులు ఆదేశాలు ఇస్తున్నా సంబంధిత బడ్జెట్ ముందుగా ఇవ్వాలని కోరినా ఇప్పటివరకు ఇవ్వలేదని రాష్ట్ర వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు ఓ ప్రకటనలో విమర్శించారు. సదుపాయాలు కల్పించాలని ఆదేశిస్తున్నారని కావాల్సిన నిధులు మాత్రం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిసారి కిందిస్థాయి వీఆర్వోలతో డబ్బులు ఖర్చు పెట్టించి నిధులు ఇవ్వడం లేదన్నారు. రెండేళ్ల నుంచి బీఎల్‌వోలకు రావాల్సిన నిధులు ఇవ్వడం లేదని ఈ విషయంపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిని కలిసి విజ్ఞప్తి చేసినా ఇప్పటివరకు నిధులు మంజూరు చేయకపోవడం సరికాదన్నారు. ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లకు సంబంధించి ముందుగానే బడ్జెట్ విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. బీఎల్‌వోలకు రావాల్సిన బకాయిలు విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఓటుహక్కు వినియోగించుకోవాలి

ఏలూరు ఎడ్యుకేషన్, మే 8 : ఏపీ రాష్ట్ర భవిష్యత్తు కోసం ఈనెల 13న జరుగనున్న ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకోవాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాస్పిటల్ బోర్డ్ ఆఫ్ ఇండియా జాతీయ వైస్‌చైర్మన్ డాక్టర్ సి.శ్రీనివాసరాజు ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. అరాచకం, అవినీతి, అశాంతికి వ్యతిరేకంగా పౌరులు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

చికిత్స పొందుతూ ఓ వృద్ధురాలి మృతి

ఏలూరు క్రైం, మే 8 : వర్షంలో తడిచి అస్వస్థతకు గురైన ఓ వృద్ధురాలు ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. హనుమాన్‌జంక్షన్ బస్టాండ్‌లో వర్షంలో తడిచిపోయి అస్వస్థతకు గురై మంగళవారం అర్ధరాత్రి 108 అంబులెన్సుకు సమాచారం అందడంతో అంబులెన్సు సిబ్బంది ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. ఆసుపత్రిలోనే చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఆమె పేరు సీతమ్మ (70)గా మాత్రమే చెప్పగలిగింది. అనుమానాస్పద మృతిగా భావించి ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.



రక్తదానం చేస్తున్న రెడ్‌క్రాస్ సిబ్బంది

ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం

ఏలూరు క్రైం, మే 8 : ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని, ప్రపంచ తలసేమియా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో రెడ్‌క్రాస్ భవనం వద్ద పలు కార్యక్రమాలను నిర్వహించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను నిర్వహించారు. తొలుత రెడ్‌క్రాస్ వ్యవస్థాపకులు జీన్‌హెన్రీ డ్యూనాండ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రెడ్‌క్రాస్ జెండాను ఎగురవేసి వందనం చేశారు. రెడ్‌క్రాస్ కార్యదర్శి సీతారామ్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు జీన్ హెన్రీ డ్యూనాండ్ గౌరవార్థం అయన జన్మదినోత్సవాన్ని పురస్కరిం చుకుని ప్రతి ఏడాది రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సిబ్బంది రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మాతా శిశు విభాగం వద్ద భోజనాల పంపిణీ చేశారు. కమిటీ సభ్యులు రామారావు, పద్మజావాణి, ఆర్.కమల, ఉమావాణి, ప్రసాద్, కూచిపూడి వెంకటకృష్ణ, శ్రీలక్ష్మి, పీఆర్వో కేవీ రమణ, సూర్యనారాయణ పలువురు పాల్గొన్నారు.

బ్రాహ్మణులను అవమానించిన వైసీపీ

ఏలూరుటూటౌన్, మే 8: టీడీపీ ప్రభుత్వం 2014లో బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారికి కావాల్సిన సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిందని టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎంబీఎస్.శర్మ అన్నారు. సమితి కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బ్రాహ్మణ కార్పొరేషన్, బీసీ కార్పొరేషన్‌లో విలీనం చేసి బ్రాహ్మణుల మనోభావాలను దెబ్బతీశారన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమిని గెలిపించి బ్రాహ్మణ జాతి గౌరవాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు.

రాజులకొట్టాడలో పోలింగ్ బూత్

»72 ఏళ్ల తరువాత ఏర్పాటు» గ్రామస్థుల హర్షం



కొట్టాడ శివారు రాజులకొట్టాడలో ఏర్పాటు చేసిన 149వ పోలింగ్ కేంద్రం

కైకలూరు, మే 8: ఎన్నికల కమిషన్ కొత్తగా పోలింగ్ బూత్ ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కైకలూరు మండలం కొల్లేరు గ్రామమైన కొట్టాడ పంచాయతీ పరిధిలో చిన్న కొట్టాడ, జంగంపాడు, పల్లిపాలెం, రాజుల కొట్టాడ హేబిటేషన్లు ఉన్నాయి. వీటిలో రాజుల కొట్టాడ గ్రామం ఉప్పుటేరుకు అవతల వైపు పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మండలం సిద్ధాపురానికి దగ్గరగా ఉంటుంది. ఎప్పుడు ఎన్నికలు జరిగినా నాటు పడవలపై ప్రమాదపుటంచున ప్రయాణం చేసి కొట్టాడ, జంగంపాడులో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకునే వారు. ఆ ప్రాంత ప్రజలంతా తమకు ప్రత్యేక పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేయాలని ఎప్పటి నుంచో కోరుకోవడంతో 2024 సార్వత్రిక ఎన్నికలకు ఆ గ్రామానికి ప్రత్యేక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 1952లో కైకలూరు నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి ఓటు హక్కును వినియోగించుకునేందుకు పార్లమెంట్, ఎమ్మెల్యే సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలకు సైతం స్త్రీ, పురుషులు అని తేడా లేకుండా నాటుపడవలపై ప్రయాణించి ఓటు హక్కు వినియోగించుకునేవారు. కొన్ని సందర్భాలలో ఉప్పుటేరు ఉధృతంగా ప్రవహిస్తున్నప్పటికి బిక్కుబిక్కు మంటూ వెళ్లి ఓటు హక్కును వినియోగించుకునేవారు. 72 ఏళ్లుగా ఇదే పరిస్థితి ఎదుర్కొన్న రాజుల కొట్టాడ గ్రామస్థులకు కొత్త పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ పోలింగ్ బూత్ నెంబరు 149 కాగా 478 మంది ఓటర్లను ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో పురుషులు 243, స్త్రీలు 235 ఓటర్లు ఉన్నారు. వీరందరికీ ఆ గ్రామ రామాలయ సమీపాన ఉన్న ఎంపీ యూపీ స్కూల్లో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయానికి ఆ గ్రామస్థులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కూటమిలో చేరిన గుర్వాయిపాలెం సర్పంచ్



కలిదిండి, మేరీ 8 : గుర్వాయిపాలెంలో వైసీపీకి షాక్ తగిలింది. వైసీపీ మద్దతుదారుడైన సర్పంచ్ బత్తిన ఉమామహేశ్వరరావు బుధవారం కలిదిండిలో కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్ సమక్షంలో 50 మంది యువతతో కలసి కూటమిలో చేరారు. కామినేని వీరికి కూటమి కండువాలు కప్పి ఆహ్వానించారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ముదినేపల్లి మండల పరిషత్ కార్యాలయం

ముదినేపల్లి నియోజకవర్గం రద్దయి 15 ఏళ్లు

ముదినేపల్లి, మే 8 : పది విడతల సార్వత్రిక ఎన్నికలకు నియోజకవర్గ కేంద్రంగా ఉన్న ముదినేపల్లి నియోజకవర్గం రద్దయి ఇప్పటికి 15 ఏళ్లు. 1962లో ముదినేపల్లి కేంద్రంగా ఏర్పడిన నియోజకవర్గం 2004 వరకు కొనసాగింది. 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో ముదినేపల్లి అసెంబ్లీ నియోజకవర్గం రద్దయి కైకలూరు నియోజకవర్గంలో కలిసింది. అప్పటి వరకు ముదినేపల్లి నియోజకవర్గంలో ఉన్న నందివాడ, గుడ్లవల్లేరు, గుడివాడ రూరల్ మండలాలు గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గంలో కలసిపోగా, మండవల్లి మండలంలోని కొన్ని గ్రామాలు, ముదినేపల్లి మండలం పూర్తిగా కైకలూరు నియోజకవర్గంలో కలిశాయి. ముదినేపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పలువురు హేమా హేమీలే ఎమ్మెల్యేలుగా శాసనసభలోకి అడుగు పెట్టారు. తొలి ఎమ్మెల్యేగా బొప్పన హనుమంతరావు ఎన్నిక కాగా, అనంతరం కాజ రామనాథం, పిన్నమనేని కోటేశ్వరరావు, యెర్నేని సీతాదేవి, పిన్నమనేని వెంకటేశ్వరరావు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. నియోజకవర్గం నుంచి ఎన్నికైన యెర్నేని సీతాదేవి (టీడీపీ), పిన్నమనేని వెంకటేశ్వరరావు (కాంగ్రెస్) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యాశాఖ మంత్రులుగా వ్యవహరించారు.

ఎన్నికల స్పెషల్


ఒకటికి.. ఒక బ్యాలెట్ బాక్స్..



పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో ఎన్నికల నిర్వహణకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లు అందుబాటులోకి వచ్చాయి. బ్యాలెట్ బాక్సులు కనుమరుగయ్యాయి. అంతకు ముందు బ్యాలెట్ పేపర్ల ద్వారా ఎన్నికలు జరిగినప్పుడు బాక్సులు ఉండేవి. పోటీ చేసిన అభ్యర్థులందరికీ వేర్వేరుగా బ్యాలెట్ బాక్స్‌లు ఏర్పాటు చేసేవారు. 1952, 1957 ఎన్నికల్లో ఒక్కో అభ్యర్థికి ఒక్కో బ్యాలెట్ బాక్సు ఏర్పాటు చేశారు. దీనివల్ల బాక్సుల తయారీ ఖర్చు అధికం కావడం, బాక్సులను భద్రపర్చటం కష్టం కావడంతో ఈ విధానం మార్చేశారు. 1962 నుంచి అభ్యర్థులందరికీ ఒకే బ్యాలెట్ బాక్సును ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఈవీఎంలు రావటంతో బాక్సుల పద్ధతి లేదు.

మీ ఓటే.. మీ భవిష్యత్

అభ్యర్థుల కొత్త నినాదం




మీ ఓటు.. మీ భవిష్యత్.. ఇది ఓటర్లకు అధికారుల అవగాహన కార్యక్రమం కాదు. ఈసారి ఎన్నికల్లో అభ్యర్థులు కొత్త నినాదం అందుకున్నారు. గెలిస్తే అది చేస్తాం.. ఇది చేస్తాం అనే పాత పురాణంతో విసుగెత్తించే దాని కంటే ఓటు ప్రాధాన్యం చెప్పడం మంచిదనుకున్నారో.. ఏమో.. మేము మండుటెండల్లో సైతం మీ గ్రామానికి, మీ వీధికి, మీ ఇంటి వద్దకు వచ్చి ఓట్లు అభ్యర్థిస్తున్నాం. అంటే మీ ఓటు ఎంత విలువైందో తెలుసుకోండి.. ఓటు హక్కును వినియోగించుకోండని అంటూ ఓటర్లకు పిలుపునిస్తున్నారు. ఈ ఎన్నికలు మీకు, మీ పిల్లల భవిష్యత్‌కు గీటు రాయి అంటూ ఉపన్యాసాలు దంచుతున్నారు.

- ముదినేపల్లి

కైకలూరు.. ఇద్దరి మధ్యే ప్రధాన పోరు..

ఈ సార్వత్రిక ఎన్నికల్లో కైకలూరు ప్రతిష్ఠాత్మకంగా మారింది. కూటమి పక్షాన భారతీయ జనతా పార్టీకి ఈ స్థానం కేటాయించి సీనియర్ నేత డాక్టర్ కామినేని శ్రీనివాస్‌ను వ్యూహాత్మకంగా రంగంలోకి దింపారు. ఇప్పటికే కైకలూరులో అన్ని వర్గాలకు చేరువగా ఉన్న కామినేని పోటీకి దిగడం వైసీపీకి షాక్ ఇచ్చింది. ఈ నియోజకవర్గం నుంచి రెండో సారి పోటీ చేస్తున్న సిట్టింగ్ ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి దూలం నాగేశ్వరరావుకు ఈ సారి కామినేనితో పాటే కాక అన్ని వైపుల నుంచి కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయి. ఓ వైపు జనసేన, టీడీపీ క్యాడర్ అంతా కామినేనితో కలసి, మెలసి అటు ప్రచారంలోనూ, ఇటు ఎన్నికల ఎత్తుగడల్లోనూ ముందుండడం, అదే సమయంలో నాగేశ్వరరావుకు కొన్ని వర్గాలు దూరం కావడం, మరికొన్ని వర్గాలు గుట్టుగా వ్యవహరించడం, దీనికి తోడు ఆయన ఒక్కరే ఏకపక్షంగా పోటీని ఎదుర్కొనే పరిస్థితులు నెలకొన్నాయి. వీరి మధ్య ప్రచారంలో పోటీయే కాక ఎత్తుగడలు సాగుతూ వచ్చాయి.

-కైకలూరు




కూటమిలోకి భారీగా వలసలతో కమలంలో ఉత్సాహం ● స్థానిక సమస్యలతో వైసీపీకి దడ

చక్రం తిప్పిన కామినేని..

తన రాజకీయ అనుభవం, కూటమితో సాన్నిహిత్యం, ప్రభుత్వ వ్యతిరేకతతో అసంతృప్తితో రగిలిపోతున్న కొందరిని తనవైపు తిప్పుకోవడంలో బీజేపీ అభ్యర్థి కామినేని ఇప్పటికే సక్సెస్ అయ్యారు. ఈ పరిణామాలన్నీ సహజంగానే క్షేత్రస్థాయిలో లోతట్టుగా జనం మధ్యకు వెళ్లి సరికొత్త బలాన్ని ఇచ్చినట్టు కూటమి ఇప్పటికే అంచనా కట్టింది. వ్యక్తిగత నిందారోపణలకు దూరంగా ఒక సైద్ధాంతిక పరంగా, వ్యూహాత్మకంగా ప్రచారం సాగించడం కూడా కామినేనికి ఉన్న బలం రెట్టింపు చేసిందనే అంచనాలో మరి కొంత మంది ఉన్నారు. గ్రామాల్లో వైసీపీ నాయకులు, కార్యకర్తలు కూటమిలో చేరేందుకు ముందుకు రావడంతో వారి బలాబలాలను కామినేని అంచనా వేసి పార్టీలోనికి ఆహ్వానించారు. ఏ నాయకుడి వల్ల అయినా నష్టం జరుగుతుందంటే వారిని పార్టీలోకి వద్దు అంటూ సర్దిచెప్పి పరోక్షంగా మద్దతును కూడగట్టుకుంటున్నారు. ఒక నాయకుడు వస్తే గతంలో ఉన్న నాయకులకు మధ్య విబేధాలు తలెత్తిన సందర్భాల్లో కూడా కామినేని తనదైన శైలిలో ఇరు వర్గాలతో చర్చించి విబేధాలు లేకుండానే ప్రత్యర్థి వర్గాన్ని పార్టీలోకి స్వాగతించారు. ఓట్లు వచ్చే నాయకులకు గాలం వేసి తీసుకురావడంలో కామినేని చక్రం తిప్పారన్నది జగమెరిగిన సత్యం. ఈ పరిణామాల క్రమంలో కైకలూరులో కామినేనిదే పైచేయిగా ఉందన్న అంచనాకు అత్యధికులు వచ్చినట్టు చెప్తున్నారు.

సిట్టింగ్ ఎమ్మెల్యేగా.. అభ్యర్థిగా దూలం..

కైకలూరులో నియోజకవర్గంలో జరిగే ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే వైసీపీ అభ్యర్థి దూలం నాగేశ్వరరావు అటు ప్రచారంలోనూ ఇటు ఎత్తుగడల్లోనూ ముందు వరుసలో నిలిచేందుకు ప్రయత్నించారు. ఇప్పటికే పార్టీ పరంగా ఉన్న క్యాడర్, తనను ఇన్నాళ్ళు సమర్థిస్తూ వచ్చిన నేతలు కైకలూరు ప్రాంతాల్లో తన సామాజిక వర్గం తాను ఇన్నాళ్ళు చేసిన కొన్ని పనుల్లో లబ్ధి పొందిన వారంతా ఈ ఎన్నికల్లో తనకే మద్దతుగా నిలుస్తారని ఇప్పటికే దూలం ఒక నిర్దిష్ట అభిప్రాయానికి వచ్చినట్టు ఆయన అనుచరుల వాదన. అయితే ఈ ఐదేళ్లల్లో వైసీపీ పరంగా పెరిగిన ప్రభుత్వ వ్యతిరేక వైఖరి గత ఎన్నికల్లో మద్దతు ఇచ్చిన కొన్ని వర్గాలు ఈసారి ముఖం చాటేస్తుండగా వైసీపీ ఉక్కిరి బిక్కిరి అవుతోంది. దీనిని అధిగమించేందుకు ఎమ్మెల్యే హోదాలోనూ వైసీపీ అభ్యర్థిగా దూలం నాగేశ్వరరావు తుది ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.



డాక్టర్ కామినేని శ్రీనివాస్

బలాలు

- స్నేహస్వభావి, అజాత శత్రువుగా పేరొందారు.
- నమ్మిన ప్రజలకు అండగా నిలబడతారు.
- అన్నివర్గాల ప్రజలతో మమేకమై ఉంటారు.
- గత ఎన్నికల్లో ఓటమి చెందడంతో ఈసారి విజయం సాధించాలని తెలుగు తమ్ముళ్ళల్లో పట్టుదల.

బలహీనత

- మంత్రిగా పనిచేయడంతో స్థానికంగా ప్రజలకు కొంత అందుబాటులో ఉండరనేది కొందరి వాదన.

దూలం నాగేశ్వరరావు



బలాలు

- అధికారం, ఆర్థిక బలం

బలహీనత

- తమను వ్యతిరేకిస్తే అక్రమంగా కేసులు బనాయించడం.
- సొంత పార్టీవారిపైనే భౌతిక దాడులు, కేసులు.
- కుటుంబ పాలన జోక్యం ఎక్కువ అవడంతో ప్రజల్లో అసంతృప్తి.
- అక్రమ సంపాదన, ఇసుక మాఫియా, భూ దందాలు.

అసెంబ్లీ బరిలో ఉన్న అభ్యర్థులు

వ.సంఖ్య	అభ్యర్థి పేరు	పార్టీ పేరు	పార్టీ గుర్తులు
1.	కామినేని శ్రీనివాస్	బీజేపీ	కమలం
2.	దూలం నాగేశ్వరరావు	వైసీపీ	సీలింగ్ ఫ్యాన్
3.	నాగేశ్వరరావు మన్నేపల్లి	బీఎస్పీ	ఏనుగు
4.	బొడ్డు నోబుల్	కాంగ్రెస్	హస్తం
5.	కమతం నిరీక్షణరావు	భారత చైతన్య యోజన	గన్ కిసాన్
6.	గొంతుపులుగు సతీష్‌కుమార్	జైభీమ్‌రావ్ భారత్	కోటు
7.	లావేటి వీరశివాజీ	ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్	సింహం
8.	అనుమోలు సోమేశ్వరరావు	స్వతంత్ర అభ్యర్థి	డైమండ్
9.	కొప్పుల విజయబాబు	స్వతంత్ర అభ్యర్థి	హెల్మెట్
10.	కోటి శ్రీనివాసరావు	స్వతంత్ర అభ్యర్థి	రింగ్
11.	గణేష్ బాలి	స్వతంత్ర అభ్యర్థి	బ్యాట్
12.	గునుకుల నారాయణ	స్వతంత్ర అభ్యర్థి	ఆపిల్
13.	చెన్నంశెట్టి సోమసుందర్	స్వతంత్ర అభ్యర్థి	బక్కెట్
14.	బొడ్డు కిరణ్‌కుమార్	స్వతంత్ర అభ్యర్థి	బ్లాక్‌బోర్డు
15.	మాదాసు సత్యనారాయణ	స్వతంత్ర అభ్యర్థి	గ్లాస్


తాడినాడలో ఆక్వా రైతుల సమస్యలు తెలుసుకుంటున్న కామినేని


కైకలూరులో కమ్మిలి విఠలరావు సతీమణి స్వర్ణకుమారి ప్రచారం

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం : కామినేని

కలిదిండి, మే 8 : గ్రామాల్లో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ హామీ ఇచ్చారు. బుధవారం కలిదిండి మండలంలో తాడినాడ, చినతాడినాడ, విభరాంపాడు, దుంపలకోడు దిబ్బ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా పైపులైన్లు ఏర్పాటు చేసి ఇంటింటికి స్వచ్ఛ నీరు ఇస్తామన్నారు. రహదారులు, గుంతలు పడి అధ్వానంగా ఉండటంతో కొద్దిపాటి వర్షానికే చెరువులను తలపిస్తున్నాయన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రోడ్ల అభివృద్ధిని విస్మరించిందన్నారు. మత్స్యకారుల జీవనోపాధికి విఘాతంగా ఉన్న జీవో నంబర్ 217ను రద్దు చేస్తామన్నారు. ఆదరణ పథకం ద్వారా సబ్సిడీపై వలలు, పడవలు మంజూరు చేస్తామన్నారు. ఉప్పుటేరు తీర గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. చేపలు, రొయ్యలకు గిట్టుబాటు ధర కల్పించి ఆక్వా రైతులు లాభాల బాటలో పయనించేలా కృషి చేస్తానన్నారు. కేంద్ర, రాష్ట్రాల సహకారంతో ఆక్వా మేతల ధరలను నియంత్రిస్తామన్నారు. స్థానిక ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించారన్నారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతున్నారు. కూటమి అభ్యర్థినైన తనకు కమలం గుర్తుపై, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్‌కు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అంగ్రాజు శ్రీనివాస్, తాడినాడ బాబు, జడ్పీటీసీ బొర్రా సత్యవతి, వైస్ ఎంపీపీ కట్టా నాగలక్ష్మి, మత్స్యకారుల సొసైటీ మాజీ అధ్యక్షుడు సంగాని గంగాధరరావు, పామర్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ సతీమణి ప్రచారం

కైకలూరు, మే 8: బుధవారం కైకలూరు పట్టణంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు సతీమణి స్వర్ణకుమారి ఆధ్వర్యంలో బైపాస్ రోడ్డు, దానెగూడెం రోడ్డు, వైఎస్సార్‌కాలనీ ప్రాంతాల్లో వందలాదిమంది కూటమి కార్యకర్తలతో కలసి ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. బీజేపీ అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌కు కమలం గుర్తుపై, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేయడంతో ప్రజలు ఆమెకు స్వాగతం పలికారు. కైకలూరు ఎంపీటీసీ-2 మంగినేని రామకృష్ణ, కూటమి నాయకులు పెన్మెత్స త్రినాథరాజు, బొమ్మనబోయిన విజయలక్ష్మి, కురేళ్ళ బేబి, డీఎం నవరత్నకుమారి, పూల రామచంద్రరావు, కొల్లి వరప్రసాద్, తోట లక్ష్మి, పంచాయతీ వార్డు సభ్యులు పి. సుధారాణి, పి. రమ్య, మాజీ వార్డు సభ్యులు బుర్ల సత్యనారాయణ, వీరాబత్తిన సుధా, శొంఠి రాజేశ్వరి, ఎండీ జానీ, కెకె బాబు, ఎండీ ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కైకలూరు వెలంపేట కాలనీలో కూటమి నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రచారాన్ని నిర్వహించారు. కూటమి నాయకులు తెంటు నాగేశ్వరరావు, బంకపల్లి భాస్కరరావు, డోకల శ్రీనివాసు, కమతం శ్రీను, బెల్లాని శ్యామలరావు, కుండబోతు నాగరాజు, వేగిరెడ్డి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తమ్మిలేరుపై బ్రిడ్జి నిర్మాణం : పుట్టా


చాట్రాయి మండలం పోలవరంలో గజమాలతో సత్కారం

చాట్రాయి, మే 8: తనపై నమ్మకం ఉంచి ఎంపీగా గెలిపిస్తే చాట్రాయి మండలం పోలవరం, చింతలపూడి మండలం యడవల్లి గ్రామాల మధ్య తమ్మిలేరుపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని ఏలూరు పార్లమెంట్ కూటమి అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్ యాదవ్ హామీ ఇచ్చారు. చాట్రాయి మండలం పోలవరం, జయపురం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ కొన్ని దశాబ్దాల నుంచి ఇక్కడ బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు కోరుతున్నా, అనేక కారణాల వల్ల కార్యరూపం దాల్చలేదని, తాను ప్రజల కలను నెరవేరుస్తానని అన్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణం జరిగితే జిల్లా కేంద్రం ఏలూరు పట్టణానికి దగ్గర దారి ఏర్పడి గ్రామీణ ప్రజలకు, రైతులకు మేలు జరుగుతుందన్నారు. టీడీపీ ప్రభుత్వం 70 శాతం పూర్తి చేసిన చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని వైసీపీ గాలికి వదిలేసి శిథిలావస్థకు చేర్చిందని, కూటమి అధికారంలోకి రాగానే చింతలపూడి పనులు ప్రారంభించి మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గంలో పరిశ్రమలు స్థాపించి యువతకు ఉద్యోగావకాశాలు, మామిడి, పామాయిల్, మొక్కజొన్న రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తానని, గ్రామాలకు మౌలిక వసతులు కల్పించి ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తానని అన్నారు. నూజివీడు అసెంబ్లీ కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథికి, తనకు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. పోలవరం గ్రామంలో టీడీపీ-జనసేన-బీజేపీ శ్రేణుల భారీ ర్యాలీతో పుట్టా మహేష్ యాదవ్‌కు, పార్థసారథి కుమారుడు నితిన్ కృష్ణకు ఘన స్వాగతం పలికి క్రేన్‌తో గజమాల వేసి సత్కరించారు. ఎన్నారై టీడీపీ నాయకుడు బొట్టు వంశీ, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు మరిడి చిట్టిబాబు, బసవారెడ్డి, మోరంపూడి శ్రీనివాసరావు, బొట్టు రామచంద్రరావు, కొల్లి వరప్రసాద్, బొట్టు లక్ష్మణరావు, జగదీష్, యర్రా హేమంత్‌కుమార్, చాగంటి బుచ్చిబాబు, మరిడి చిన్న అప్పారావు, నోబుల్‌రెడ్డి వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కొరగుంటపాలెం వద్ద ఎండ తెలియకుండా పెరిగిన చెట్లు

10 కిలోమీటర్లు కూల్..కూల్

ముదినేపల్లి, మే 8 : తీవ్రమైన ఎండ వేడిమి నుంచి జనానికి ఉపశమనం కలిగిస్తున్నాయి ముదినేపల్లి నుంచి వడాలి, సింగరాయిపాలెం నుంచి కోరుకొల్లు వెళ్లే ప్రధాన రహదారిలోని వృక్షాల సమూహం. సుమారు పది కిలోమీటర్ల దూరం రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఈ చెట్లు వేసవి తాపం తెలియకుండా చేస్తున్నాయి. ముదినేపల్లి - వడాలి మధ్య బ్రిటీష్ హయాంలో నాటిన చెట్లు మహావృక్షాలు కాగా, సింగరాయపాలెం నుంచి బొమ్మినంపాడు శివారు వరకు 30 ఏండ్ల క్రితం నాటిన చెట్లు ఎంతో నీడనిస్తున్నాయి. ప్రయాణీకులకు ఎండ పొరను మచ్చుకైనా కనిపించకుండా చేస్తున్నాయి. మండుటెండలో సైతం ఈ రూటులో చెట్ల కింద కూల్..కూల్‌గా ప్రయాణం చేయవచ్చు.


ఓటు హక్కును వినియోగించుకుంటున్న ఉద్యోగులు

ముగిసిన పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ

నూజివీడు, మే 8: ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేట్ సెంటర్లో పోస్టల్ బ్యాలెట్ నమోదు ప్రక్రియ బుధవారంతో ముగిసింది. నూజివీడు ఆర్వో వై.భవాని శంకరి పర్యవేక్షణలో ఈ సెంటర్‌ను నిర్వహించగా, బుధవారం మొత్తం 154 మంది ఉద్యోగులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. నూజివీడు నియోజకవర్గ పరిధిలో గల 127 మంది ఉద్యోగులు, జిల్లాలోని ఇతర నియోజకవర్గాలకు చెందిన 27 మంది ఉద్యోగులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నట్లు ఆర్వో తెలిపారు.

సమస్యాత్మక గ్రామాలు రెండు

ముదినేపల్లి, మే 8: ముదినేపల్లి మండలంలో రెండు గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించినట్లు ఎస్ఐ వెంకట్ కుమార్ తెలిపారు. సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించిన ముదినేపల్లి, గురజ గ్రామాల్లో పోలింగ్ సందర్భంగా అదనపు బందోబస్తు ఏర్పాటు చేసి పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలోని ఇతర పోలింగ్ కేంద్రాల వద్ద గత ఎన్నికల తీరు తెన్నులను అంచనా వేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

సిద్ధార్థలో క్యాంపస్ సెలక్షన్స్

నూజివీడు టౌన్, మే 8: నూజివీడు శ్రీ సిద్ధార్థ బి-ఫార్మసీ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలను నిర్వహించారు. దివిస్ ల్యాబ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ క్యాంపస్ ఇంటర్వ్యూలలో మొత్తం 150 మంది విద్యార్థులు హాజరు కాగా 60 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు సిద్ధార్థ బి-ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ జి.సుబ్బారావు తెలిపారు. ఇంటర్వ్యూలను దివిస్ ల్యాబ్స్ హెచ్‌ఆర్ మేనేజరు రామకృష్ణ పర్యవేక్షించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో పద్మావతీ దేవి

పోలింగ్ కేంద్రాల్లో వసతులు ఉండాలి

ముసునూరు, మే 8: పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం సదుపాయాలు ఉండాలని తహసీల్దార్ జవహర్ బాజి, ఎంపీడీవో సీహెచ్. పద్మావతిదేవి ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌వోలు, పంచాయతీ, సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న 58 పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, మంచినీరు, షామియానా, వైద్య శిబిరం తదితర సౌకర్యాలను ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల చుట్టుపక్కల పరిస్థితి, సమస్యాత్మక గ్రామాల నివేదికను తక్షణమే పోలీస్‌లకు ఇవ్వాలని సూచించారు. ప్రతి ఓటర్‌కు ఓటర్ స్లిప్ అందించాలని, విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్ఐ పి.వాసు, ఈవోపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు పాడిగేదె మృతి



ముసునూరు, మే 8: ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కురిసిన భారీ వర్షానికి చింతలవల్లిలో పడిన పిడుగుకు పాడిగేదె మృతి చెందింది. రైతు తొర్లపాటి రాంబాబు పశువులను మేపుతున్న క్రమంలో పిడుగుపడటంతో దాని తీవ్రతకు పాడిగేద అపస్మారక స్థితికి వెళ్ళింది. బుధవారం ఉదయం మృతి చెందింది. దీని విలువ లక్ష రూపాయలు ఉంటుందని రైతు వాపోయాడు. వీఆర్వో యశోద పరిశీలించారు. నివేదికను తహసీల్దార్ జవహర్ బాజికి అందజేసినట్లు ఆమె తెలిపారు.